TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేదికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబంధిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 21 | ఎడిటర్ : కందాడి మహెందర్ రెడ్డి | సోమవారం, జూన్,22, 2026 | పేజిలు : 8 | వెల : రూ.4/-



భారత్ ఇంధన భద్రతకు

## భారీ ఊరట

- 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో భారత్‌కు ప్రయాణం
- కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రకటన.. ప్రభుత్వ సమన్వయంతోనే సాధ్యమైందని వెల్లడి

**ఇంటర్నెట్ న్యూస్,జూన్21**
భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూడు భారతీయ జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి.

విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు

# తీసుకుంటాం

రీ-నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం

నీట్ విద్యార్థులు ఆ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసంతా ఆనందంతో నిండిపోయింది: పొన్నం ప్రభాకర్

- వేలాది మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని మంత్రి వెల్లడి
- ఇది విద్యార్థుల సంక్షేమానికి నిదర్శనమన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకున్న నిర్ణయమని ప్రశంస



**హైదరాబాద్,జూన్21,**
ఆదివారం జరిగిన రీ-నీట్ పరీక్ష సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వేలాది మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సౌకర్యం ద్వారా విద్యార్థులు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.
నీట్ విద్యార్థులు ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకోవడం చూశాక మనసం తా ఆనందంతో నిండిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయక త్వంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయం, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయా ణ సౌకర్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. విద్యార్థుల ఉన్నత లక్ష్యాల సాధనలో వారికి అన్ని విధాలుగా అండగా నిలిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజా పాలనలో భాగంగా విద్యార్థుల సంక్షేమానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో

# మాఫియా రాజ్యం నడుస్తోంది

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు
- దోచుకో.. దాచుకో.. అన్నట్లుగా కాంగ్రెస్ మంత్రులంతా కలిసి మాఫియాలు, స్కామ్‌లు

**హైదరాబాద్,జూన్21,**
రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం పర్యటించారు. బీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశానికి విచ్చేసిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ... ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాఫియా రాజ్యం నడుస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు అని పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో దోచుకో.. దాచుకో.. అన్నట్లుగా కాంగ్రెస్ మంత్రులంతా కలిసి మాఫియాలు, స్కామ్‌లు చేస్తు న్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులకు గౌరవం లేదని ఆరోపించారు.



టీఎంసీకి

## భారీ షాక్

**ఇంటర్నెట్ న్యూస్,జూన్21**
పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం రేకెత్తిస్తూ.. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాలను అధికారులు స్తంభింపజేశారు. సుమారు రూ.440 కోట్ల నిధులున్న ఈ ఖాతాలపై వేటు పడటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

## ముంబైలో మళ్లీ కరోనా కేసుల కలకలం!

- ముంబైలో విజృంభిస్తున్న కోవిడ్, స్వైన్ ఫ్లూ కేసులు
- రుతుపవనాల ఆలస్యంతో శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల పెరుగుదల
- తీవ్ర జ్వరం, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు పోటెత్తుతున్న రోగులు
- యాంటీబయాటిక్స్ వాడొద్దని, జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన

**ఇంటర్నెట్ న్యూస్,జూన్21**
రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో ముంబై నగరం వైరల్ వ్యాధుల గుప్పిట్లో చిక్కుకుంది. ముఖ్యంగా గత కొన్ని వారాలుగా కోవిడ్-19, స్వైన్ ఫ్లూ , ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కేసులు గణనీయంగా పెరిగాయి.




దీంతో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలతో బాధపడుతూ అనేకమంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

## తమిళనాడులో ఘోర ప్రమాదం...

- తమిళనాడు సీఫుడ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్
- ఈ దుర్ఘటనలో ఏడుగురు కార్మికుల మృతి
- 74 మందికి పైగా తీవ్ర అస్వస్థత, పలువురి పరిస్థితి విషమం



**ఇంటర్నెట్ న్యూస్,జూన్21**
తమిళనాడులో ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటుచేసుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ సీఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆరుగురు మహిళలు ఉన్నారు. ఈ దుర్ఘటనలో మరో 74 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ముగిసిన నీట్

# రీ ఎగ్జామ్

- ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పునఃపరీక్ష
- ఫిజిక్స్ కఠినంగా, బయాలజీ సులభంగా ఉందన్న విద్యార్థులు
- దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది హాజరు
- జూన్ 28 నాటికి అధికారిక ఆన్సర్ కీ విడుదల అంచనా

**న్యూఢిల్లీ,జూన్21**
దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూసిన నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ ఆదివారం (జూన్ 21) ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు ఈ పరీక్షను నిర్వహించారు. దివ్యాంగులకు 6.20 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం కల్పించారు. సుమారు 23 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. భారత్‌తో పాటు రియాద్‌లోని అంతర్జాతీయ




కేంద్రంలో కూడా పరీక్షను విజయవంతంగా పూర్తి చేశారు. కాగా, ఎప్పట్లాగానే పలు పరీక్ష కేంద్రాల వద్ద ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, తమను లోపలికి అనుమతించకపోవడంతో కన్నీటి పర్యంతం కావడం కనిపించింది.

ఆరోగ్య

# ఆంధ్రప్రదేశే లక్ష్యం

- విజయవాడలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల ఏర్పాటు చేస్తామన్న సీఎం
- వచ్చే ఏడాది తిరుపతిలో యోగా దినోత్సవం నిర్వహిస్తామని ప్రకటన
- ఆధ్యాత్మికత, యోగాతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధ్యమన్న సీఎం

**అమరావతి,జూన్21,**
అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. యోగా గురువు రామ్‌దేవ్ బాబాతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..



రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ యోగాను చేరవేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.


సీఎం చంద్రబాబు రైతులకు

# క్షమాపణ చెప్పాలి

- అన్నదాత సుఖీభవ పథకంపై ఏపీ ప్రభుత్వాన్ని విమర్శించిన వైఎస్ షర్మిల
- మూడో ఏడాదీ రైతులకు పాక్షికంగానే నిధులు విడుదల చేశారని ఆరోపణ
- 60 లక్షల మంది అర్హులుంటే 46 లక్షల మందికే సాయం అందిందని వ్యాఖ్య




**అమరావతి,జూన్21,**
ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను వంచిస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అరకొర నిధులు విడుదల చేసి, వరుసగా మూడో ఏడాది కూడా రైతులకు అన్యాయం చేశారని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20న 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడత ఆర్థిక సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. పీఎం-కిసాన్ పథకం నిధులతో కలిపి సుమారు 46.86 లక్షల రైతు కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరింది.



భారత్ ఇంధన భద్రతకు

## భారీ ఊరట

- 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో భారత్‌కు ప్రయాణం
- కేంద్ర మంత్రి సోనోవాల్ ప్రకటన.. ప్రభుత్వ సమన్వయంతోనే సాధ్యమైందని వెల్లడి


**ఇంటర్నెట్ న్యూస్,జూన్21**
భారత సముద్ర వాణిజ్యానికి, ఇంధన భద్రతకు పెద్ద ఊరట లభించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూడు భారతీయ జెండా కలిగిన భారీ క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లు విజయవంతంగా దాటాయి. 8.6 లక్షల మెట్రిక్ టన్నుల ముడిచమురుతో ఈ నౌకలు ప్రస్తుతం భారత ఓడరేవుల వైపు ప్రయాణిస్తున్నాయి.

సోమవారం,
జూన్.22, 2026
నమస్తే భారత్
NAMASTHE BHARAT TELUGU DAILY



# తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనే నిజమైన నివాళి

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్-షాద్ నగర్ పట్టణంలోని న్యూ సిటీ కాలనీలో జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పించిన రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ శ్రేణులు**



నమస్తే భారత్ షాద్ నగర్ జూన్21:ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ సిటీ కాలనీలో గల జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. జీవితాంతం తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప మేధావిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆయన ఆశయాలను అమలు చేయడంలో బీఆర్ఎస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. జయశంకర్ కలలు కన్న స్వయం సమృద్ధి తెలంగాణ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ పార్టీ అధ్యక్షులు నటరాజన్, లక్ష్మణ్ నాయక్, పద్మా రెడ్డి, మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల వెంకట్ రెడ్డి, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు జి.టి వసంత శ్రీనివాస్, పిల్లి శారద శేఖర్, గౌస్ జానీ, గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు జూపల్లి శంకర్, వెంకట్రాం రెడ్డి, కోస్గి శ్రీనివాస్, యుగంధర్,



చింటూ, నంద కిషోర్, యాదగిరి, సర్పంచులు రాజు నాయక్, జెట్ట కుమార్, గిరి, మాజీ సర్పంచులు గోవిందు అశోక్, శ్రవణ్ పట్వారీ, పల్లె శ్రీనివాస్ రెడ్డి, జె.కె నర్సింలు, మాజీ ఎంపీటీసీలు బిశ్వ రామకృష్ణ, కాట్న శ్రీశైలం, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, చీపిరి రవి యాదవ్, సలీం, మల్చలం బిక్షపతి, కొమ్ము వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, పాపయ్య, శంకరయ్య గౌడ్, భిక్షపతి, కుమార్ గౌడ్, వేణుగోపాల్, మన్నె మొగులయ్య, నరసింహా, జంగరాజ్, రాఘవేందర్, హరిక్రిష్ణ, మోహన చారి, కె. సత్యం, నర్సింలు, ఆంజనేయులు, ప్రభాకర్, శంకర్, పవన్ సింగ్, చీపిరి సాయి, దొడ్డి రవి, నవీన్, రాజు, శ్రీకాంత్, రాజశేఖర్, భీమ్ రెడ్డి, స్వామి, వినోద్, సుశాంత్, శ్రీను, రాం బాబు, రఘు, రమేష్, సంజు నాయక్, మోహన్ నాయక్, పరుషురాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యమే మహాభాగ్యం

**- అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ- అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగా ఆసనాలు, ప్రాణాయామ ప్రదర్శనలు-అసంక్రమిత వ్యాధుల నివారణలో యోగా కీలకమని వైద్యుల సూచన- ప్రతి ఒక్కరూ రోజూ 30 నిమిషాలు యోగా చేయాలని పిలుపు**





అల్వాల్, జూన్ 21 ( నమస్తే భరత్): అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై-2026) సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి నాయకత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) ప్రోగ్రామ్ అధికారి డా. చంద్రకళ మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వమని పేర్కొన్నారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే సమగ్ర జీవన విధానమని తెలిపారు. ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలను అధిగమించవచ్చని చెప్పారు. అలాగే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వంటి అసంక్రమిత వ్యాధుల నివారణలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని పేర్కొన్న ఆమె, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 30 నిమిషాల పాటు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, భావోద్వేగ సమతుల్యతను పొందవచ్చని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులు, యువత, ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా యోగా ఆసనాలు, ప్రాణాయామం, ధ్యాన విధానాలను ప్రదర్శించి, యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. లావణ్య రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డా. శ్రీదేవి, డా. నాగరాజ్, డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్, అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. గోలి శ్రీకాంత్, ఆయుష్ విభాగానికి చెందిన ఆయుర్వేద వైద్యాధికారి డా. శ్రీదేవి, హోమియో వైద్యాధికారి డా. అనఘ్, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## శివ డిజిటల్ కార్యాలయాన్ని

# ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**- బాచుపల్లిలో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం- యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడం అభినందనీయం- స్థానిక ప్రజలకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించాలని ఆకాంక్ష- కాంగ్రెస్ నాయకుల సమక్షంలో భూపాల్‌కు శుభాకాంక్షలు**





బాచుపల్లి, జూన్ 21 (నమస్తే భారత్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి పరిధి రాజీవ్ గాంధీ నగర్‌లో భూపాల్ నూతనంగా ఏర్పాటు చేసిన శివ డిజిటల్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకుంటూ వ్యాపార రంగంలో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆధునిక సాంకేతిక సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఇటువంటి డిజిటల్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. శివ డిజిటల్ స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన డిజిటల్ సేవలు స్థానికంగా అందుబాటులో ఉండటం వల్ల సమయం, వ్యయం ఆదా కావడంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడుతుందని హన్మంత్ రెడ్డి తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణారెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, తాతిరెడ్డి, మౌలేశ్వర్ రావు, చిట్ల దివాకర్, ఏరోళ్ల విష్ణు, మద్ది నారాయణ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, మహేష్, సంజీవ్ రెడ్డి, కొలన్ ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, జితేందర్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొని భూపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నీట్ పరీక్ష నిర్వహణపై

# కలెక్టర్ మను చౌదరి ఆకస్మిక తనిఖీ

**-జేఎన్టీయూ పరీక్షా కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన- సీసీ కెమెరాల ద్వారా పరీక్ష నిర్వహణ పర్యవేక్షణ- అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు- అధికారులతో సమీక్షించి వివరాల సేకరణ**



హైదరాబాద్, జూన్ 21 ( నమస్తే భరత్ ):మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కూకట్‌పల్లి మండల పరిధిలో ఉన్న జేఎన్టీయూ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ (చీజుజు) ప్రవేశ పరీక్షను జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్ష నిర్వహణ సజావుగా జరుగుతోందో లేదో తెలుసుకునేందుకు ఆయన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. కళాశాలలోని వివిధ విభాగాల్లో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అమర్చిన సీసీ కెమెరాల ద్వారా అభ్యర్థుల పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరీక్ష నిర్వహణలో పాటిస్తున్న నిబంధనలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయా, అభ్యర్థులకు ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాష్, కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్ కుమార్, బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాస్, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, సూపరింటెండెంట్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# దూలపల్లిలో ఉచిత వైద్య సేవల సందడి

**- 47వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించిన కిషోర్ రెడ్డి- ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కాలనీ వాసులకు పిలుపు- ప్రజారోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో అవసరమని వ్యాఖ్య- పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు**

కుత్బుల్లాపూర్, జూన్ 21: నమస్తే భరత్;కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దూలపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీలో నిర్వహించిన 47వ ఉచిత వైద్య శిబిరాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించిన ఆయన, ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. దూలపల్లి సొసైటీ బ్యాంక్ వికార్ సెక్షన్ కాలనీ వాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నరేందర్ రాజు, మాజీ ఎంపీటీసీ




మల్లేష్, మాజీ కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, భాస్కర్ గౌడ్, బోగారం వెంకటేష్, ఐలేష్ యాదవ్, డప్పు నరేందర్, సాధు యాదవ్, శివారెడ్డి, కాలనీ వాసులు, టీమ్ బీకేఆర్ సభ్యులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న భరత్ సింహ రెడ్డి

**- యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుదల- ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను అలవాటు చేసుకోవాలి- సుచిత్రలో టీఎన్ఆర్ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌస్‌లో యోగ సాధన-అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**


కుత్బుల్లాపూర్, జూన్ 21 (నమస్తే భరత్ ): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని సుచిత్ర ప్రాంతంలోని టీఎన్ఆర్ అపార్ట్‌మెంట్ క్లబ్‌హౌస్‌లో నిర్వహించిన యోగ సాధన కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్య పరిరక్షణకు యోగా ఎంతో అవసరమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. యోగాను క్రమం తప్పకుండా ఆచరించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్ నివాసులు, యోగా శిక్షకులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.



# పశువుల సంరక్షణలో టీకా ఒక్కటే మార్గం

## పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్

ఖానాపురం జూన్ 21 (నమస్తే భారత్ ) : . పశువుల ఆరోగ్యాన్ని కాపాడటంలో టీకాలు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని,గాలికుంటు, గొంతువాపు, జబ్బవాపు, బ్రుసెలోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి పశువులను రక్షించుకోవడానికి టీకా ఒక్కటే మార్గమని ఖానాపురం మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వ్యాధుల నియంత్రణకు గాను టీకాలు వేయడం ద్వారా అంటువ్యాధులు ఒక పశువు నుంచి మరొక పశువుకు సోకకుండా అడ్డుకోవచ్చు. దీనినే 'మంద రోగనిరోధక శక్తి' అంటారు. వ్యాధి వచ్చిన తర్వాత పశువైద్యం కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టే కంటే, ముందుగానే టీకాలు వేయించడం చాలా తక్కువ ఖర్చుతో కూడుకుంటుందని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న పశువులే అధిక పాల దిగుబడిని ఇస్తాయి మరియు సంతానోత్పత్తి సమస్యలు లేకుండా సమర్థవంతంగా పనిచేస్తాయి. దీనివల్ల రైతుకు నేరుగా ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పశువైద్య శాఖ జారీ చేసిన టీకాల షెడ్యూల్ పక్కాగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న పశువులకే టీకాలు వేయాలి. టీకా వేయించుకున్న వివరాలను ఒక రికార్డులో నమోదు చేసుకోవడం



మర్చిపోవద్దు. టీకా వేయించిన సమయం నుంచి కొన్ని రోజుల పాటు పశువులకు తగినంత పోషకాహారం, స్వచ్ఛమైన నీరు అందించి, వాటికి విశ్రాంతినివ్వాలన్నారు. ?గుర్తుంచుకోండి.. 'టీకా వేయండి -- వ్యాధులను అరికట్టండి -- పశువుల ఆరోగ్యాన్ని కాపాడండి -- తద్వారా రైతు ఆదాయాన్ని పెంచుకోండి'. మరిన్ని వివరాలకు మీ సమీపంలోని పశు వైద్యశాలను సంప్రదించాలని వివరించారు.

## సంపాదకీయం

### పొంచి ఉన్న కరువు పరిస్థితులు..!

గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీట మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే. 2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకుముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి.

# భారతీయ టెకీలపై పెరుగుతున్న ద్వేషభావం!

## - చోరబాటుదారులు, దొంగలు అంటూ ఆరోపణలు..?



న్యూఢిల్లీ:డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా రెండొవసారి ఎన్నికైన తరువాత ఆ దేశంలో భారత టోకీలపై ద్వేష భావం తీవ్రంగా పెరిగిపోతోంది. వాస్తవంగా మన దేశానికి చెందిన టెకీలు అమెరికాకు అందిస్తున్న సాంకేతిక సేవలు ఎనలేనివి. అయితే అమెరికా సంస్థలలో ఉన్నత స్థానాలలో ఉంటూ. సిలికాన్ వ్యాలీలో ఆవిష్కరణలకు నాయకత్వం వహిస్తున్న భారతీయ టెకీలు ప్రస్తుతం ట్రంప్ ప్రభుత్వం నుంచి దాడిని ఎదుర్కొంటున్నారు. ట్రంప్ తన మద్దతుదారులను సంతోషపెట్టే ప్రయత్నంలో భారతీయ ఇంజినీర్లు, కోడర్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. వారు అమెరికాలో ప్రవేశం చేందుకు ఉపకరించిన హెచ్-1బి వీసా పథకం నేడు అసాధారణ శల్యపరీక్షకు గురవుతోంది. కొత్తగా హెచ్-1బి వీసాల కోసం దరఖాస్తు చేసే వారు లక్ష డాలర్ల ఫీజు సమర్పించుకోవాల్సి వస్తోంది.

**ప్రబలుతున్న జాత్యాహంకార ధోరణులు:** భారతీయ టెకీలకు పైగా వారి సోషల్ మీడియా ఖాతాలపై తీవ్రమైన నిఘా పెడుతున్నారు. ఇక జాత్యాహంకార ధోరణులు సరేసరి. ఇలా వారు దాటాల్సిన అడ్డంకులు ఎన్నో ఉంటున్నాయి. భారతీయులు తమ ఉద్యోగాలను లాక్కుంటున్నారన్న భయం అమెరికాలో తీవ్రంగా పెరిగిపోయింది. అమెరికాలో వలస వ్యతిరేక ధోరణులు ప్రబలిపోయాయి. భారతీయులపై జాత్యాహంకారం కూడా పెరిగింది. రాబోయే సంవత్సరంలో భారతీయులను, హిందూ దేవాలయాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరగవచ్చునని క్రిస్మస్ సందర్భంగా అమెరికా పాత్రికేయుడు మాట్ ఫోర్నీ బాహాటంగానే హెచ్చరించారు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులందరినీ స్వదేశానికి పంపే అవకాశం ఉన్నదని కూడా ఆయన తెలిపారు.

వ్యతిరేకంగా మాగా ఉద్యమకారులు చేస్తున్న వాదనలు ఎలా ఉన్నాయంటే. భారత టెకీలు అమెరికన్ల ఉద్యోగాలను దొంగిలిస్తున్నారట. మనలో నైపుణ్యం తక్కువగా ఉంటుందట. అసలు హెచ్-1బి వీసా పథకమే ఓ కుంభకోణమట. అమెరికాలో భారతీయులు లేదా భారత సంతతికి చెందిన వారికి వ్యతిరేకంగా జాత్యాహంకారం బాగా పెరిగిపోయింది. హెచ్-1బి వీసా పథకంలో చేసిన మార్పులు అక్కడ భారతీయులకు ఉన్న స్థానమేమిటో చెబుతున్నాయి. మన టెకీల పైన్న ఉన్న ద్వేష భావం క్రమేపీ ప్రధాన స్రవంతిలో ప్రవేశించింది.

ప్రభావవంతమైన భారతీయ అమెరికన్లు సైతం లక్ష్యంగా మారిపోయారు. హెచ్-1బి వీసా పథకంలో చేసిన మార్పులు భారతీయుల పరిస్థితిని మరింత దుర్భరంగా మార్చేశాయని న్యూయార్క్ పనిచేస్తున్న సాంకేతిక నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. అమెరికాలో పనిచేస్తున్న భారతీయ టెకీల భవిష్యత్తు వ్యక్తిగత పనితీరు, భాగస్వామ్యం కంటే విధానపరంగా జరిగే మార్పులపై ఆధారపడి ఉంటుందని ఆయన తెలిపారు. అధిక జీతం పొందుతున్న వారిని ప్రోత్సహించడం, చౌకగా లభించే ఉద్యోగులను నిరుత్సాహపరచడం వంటి మార్పులను ఆయన ఉదహరించారు.

**ప్రముఖులను సైతం వదలడం లేదు:** చివరికి పరిస్థితి ఎలా తయారైందంటే అమెరికా సంస్థల తమ వద్ద పనిచేస్తున్న భారతీయ టెకీల గుర్తింపును గోప్యంగా ఉంచాల్సి వస్తోంది. దీపావళి పండుగ శుభాకాంక్షలు చెప్పే విషయంలో కూడా ద్వేషభావం స్పష్టంగా కన్పించింది. అమెరికన్లు లక్ష్యంగా చేసుకున్నది కేవలం హెచ్-1బి వీసా హోల్డర్లనే కాదు. ఎఫ్బిఐ చీఫ్ కష్ పటేల్, రాజకీయవేత్త, దౌత్యవేత్త నిక్కీ హేలీ వంటి ప్రముఖులను కూడా స్వదేశానికి వెళ్లిపోవాల్సిందిగా వందలాది శ్వేతజాతి ఆధిపత్య ఖాతాలు సూచించాయి. గత దశాబ్ద కాలంలో ఆన్లైన్లో భారతీయులపై విద్వేష భావన బాగా పెరిగిపోయిందని పరిశోధకులు గుర్తించారు. భారతీయులను చొరబాటుదారులుగా, ఉద్యోగాల దొంగలుగా చిత్రించే పోస్టుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

# జంట నీరు సురక్షితమేనా?

హైదరాబాద్:జలమండలి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, నిర్వాహణలోపం కారణంగా జంట జలాశయాలైన హిమాయత్సాగర్, ఉస్మాన్సాగర్ నీరు కలుషితం అవుతోందంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో మహానగరానికి సరఫరా అయ్యే తాగునీరు సురక్షితమైనదేనా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతనెల ఓ ట్యాంకర్తో సెప్టిక్ వ్యర్థాలను గండిపేట జలాశయంలో పారయబోయడం కలకలం రేపింది. ఈసంఘటనతో నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మనం నిత్యం తాగే నీళ్లలో సెప్టిక్ వ్యర్థాలు కలుస్తున్నాయా? అని ఆందోళనకు గురయ్యారు. పటిష్టమైన వ్యవస్థను కలిగి ఉండి, గ్రేటర్ హైదరాబాద్తో పాటు జలమండలి శివారు జిల్లాల్లో కూడా విస్తరించి ఉంది. ఇంతపెద్ద నెట్వర్క్ ఉన్నప్పటికీ జంట జలాశయాల్లోకి వ్యర్థాల డంపింగ్పై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిత్యం జలమండలితో పాటు విజిలెన్స్ అధికారుల నిఘా ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యక్తులు యథేచ్ఛగా సెప్టిక్ వ్యర్థాలను జలాశయాల్లో పారబోస్తున్నారంటే నిఘా వ్యవస్థ నిర్లక్ష్యం స్పష్టమవుతోంది. అదేవిధంగా గండిపేట నుంచి ఆసిఫ్నగర్ దాకా 14 కిలో మీటర్లున్న కాండ్యూట్ నీరు కూడా అక్కడక్కడా కలుషితమవుతున్నది. కాండ్యూట్లో కొనిచోట్ల పైకప్పులుగా ఉంచిన రాళ్ల మధ్య గ్యాప్లు ఏర్పడి దానిపైన చెత్త పారబోస్తుం డటంతో నీరు కలుషితమవుతున్నది.

**పర్యవేక్షణ వైఫల్యమే కారణమా?:** జంట జలాశయాల్లో సెప్టిక్ వ్యర్థాలతో పాటు ఇతర వ్యర్థాల పారబోసిన ఘటనలు మునుపెన్నడూ వెలుగులోకి రాలేదు. ఇటీవల జరిగిన ఘటనతో జలమండలి అధికారులు, సిబ్బంది పనితీరుపై సందేహాలు కలుగుతున్నాయి. ఉస్మాన్సాగర్, హిమాయత్సాగర్ జలాశయాల పరిరక్షణకు ఇద్దరు జలమండలి సిబ్బంది, ఒక గార్డు చొప్పున పెట్రోలింగ్ నిర్వహిస్తారు. వీరు ఉదయం 10 గంటలకు విధుల్లోకి వచ్చి సాయంత్రం దాకా పెట్రోలింగ్ నిర్వహిస్తారని అధికారులు చెప్తున్నారు. సెప్టిక్ ట్యాంకర్ ఓనర్లు ఇదే అదనుగా తెల్లవారుజాము(ఉదయం 5గంటల) నుంచి ట్యాంకర్ల ద్వారా సెప్టిక్ వ్యర్థాలను జలాశయాల్లోకి వదులుతున్నట్లు సమాచారం. గతనెల 17న కూడా శివనాయక్ అనే వ్యక్తి ఉదయం



8 గంటలకు సెప్టిక్ వ్యర్థాలను ఉస్మాన్సాగర్ జలాశయంలో పారబోసేందుకు ప్రయత్నించాడు. జలమండలి సిబ్బంది ఉదయం 10 గంటలకు విధుల్లోకి వస్తుండటంతో అప్పటికే అక్రమార్కులు తమ పని కానిచ్చేస్తున్నట్లు తెలుస్తున్నది. నగర ప్రజల తాగునీటి అవసరాలకు వినియోగించే నీటిలో సెప్టిక్ వ్యర్థాలు, గృహ వ్యర్థాలను కలవనీయకుండా ఉండాలంటే జలమండలి నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికైనా పెట్రోలింగ్కు మరింత మందిని నియమించి షిప్టుల వారీగా నిఘా ఉంచాలని నగరప్రజలు కోరుతున్నారు.

**ఉస్మాన్సాగర్లోకి యథేచ్ఛగా గృహ వ్యర్థాలు..:** జంట జలాశయాల్లో ఒకటైన ఉస్మాన్సాగర్లో పరీవాహక ప్రాంతాల ప్రజలు.. గృహవ్యర్థాలతో పాటు చెత్తను బస్తాలు, పాలిథిన్ కవర్లలో తీసుకొచ్చి జలాశయంలో పారబోస్తున్నారు. దీంతో జలాశయం చుట్టూ చెత్త కుప్పలుగా పేరుకుపోతున్నది. దీంతో తాగునీరు కలుషితం అవుతున్నది. అదేవిధంగా ఉస్మాన్సాగర్, హిమాయత్సాగర్ పరీవాహక ప్రాంతాల్లో మత్స్యకారులు చేపల వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. దీంతో ఆ వ్యర్థాలు కుళ్లిపోయి నీరు కలుషితమవడంతో పాటు దుర్వాసన వెదజల్లుతున్నది. కొన్నిచోట్ల గృహ వ్యర్థాలతో పాటు, ప్లాస్టిక్ వ్యర్థాలు విచ్చలవిడిగా పడేస్తున్నారు. జంట జలాశయాల చుట్టూ ఫంక్షన్ హాళ్లు, రిసార్ట్స్ ఉండటంతో వాటిల్లో ఫంక్షన్లు, వేడుకల కోసం ఏర్పాటు చేసిన అలంకరణ వ్యర్థాలను కూడా పడేస్తున్నారు. ఎవరుపడితే వారు చెత్తను జలాశయాల్లో పడేసి కలుషితం చేస్తున్నారు. నగరంలోని ప్రజలకు మంచినీటిని అందించే జలవనరులను సంరక్షించాల్సిన జలమండలి అధికారులు మేల్కొని నీటిని కలుషితం కాకుండా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# వల్లభనేని వంశీ మళ్లీ గాయబ్..!

విజయవాడ: సామాన్యుడికి కేసులు, కోర్టులు అంటే భయం. ఎందుకంటే మంచి భవిష్యత్తు పోతుంది.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ రాజకీయ పార్టీల నేతలకు అలా కాదు. వారికి కేసులు అనేవి కామన్. జైలు జీవితం అనేది సర్వసాధారణం. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ పరారీ అయినట్లు వార్తలు వస్తున్నాయి.. ఓ కేసు విషయంలో ఆయనకు అరెస్టు తప్పదని ప్రచారం నడుస్తోంది. తన కార్యాలయం వద్ద ఆందోళన చేసిన టిడిపి కార్యకర్త పై దాడి చేశారన్న ఫిర్యాదు పై ఆయనను అరెస్టు చేస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే ఇప్పుడు ఆయనతో పాటు అనుచరులు సైతం అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే అందులో ఎంత నిజం ఉందో చూడాలి. 2019లో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఫిరాయించారు వల్లభనేని వంశీ మోహన్. ఆ సమయంలో ఆయన కేవలం చంద్రబాబుతో పాటు లోకేష్ పై విరుచుకు పడడానికే అన్నట్టు ఉండేవారు. కేవలం దానికోసమే ఆయనను వైసీపీలోకి రప్పించినట్లు అప్పట్లో వ్యవహారం నడిచేది. నోటికి ఎంత వస్తే అంత మాట అనేవారు వల్లభనేని వంశీ మోహన్. ఒకానొక దశలో చంద్రబాబు సతీమణి కోసం కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అయితే దీనిపై స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు లోకేష్. రెడ్ బుక్ లో అందరి పేర్లు రాస్తున్నానని.. తప్పకుండా అందరిపై చర్యలు ఉంటాయని అప్పట్లో హెచ్చరించారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వల్లభనేని వంశీ మోహన్ విషయంలో పెద్దగా కలుగ చేసుకోలేదు. అయితే వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై దాడి జరిగింది.

అప్పటి కేసును ఉపసంహరించుకోవాలని కోరుతూ కార్యాలయంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్ పై ఒత్తిడి చేశారు వల్లభనేని వంశీ మోహన్. బాధితుడు ఫిర్యాదుతో ఆ కేసు మళ్లీ మొదలైంది. అలా ఒక్కో కేసు వల్లభనేని వంశీ మోహన్ మెడకు చుట్టుకుంది. దాదాపు 5 నెలలకు పైగా రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు వల్లభనేని వంశీ మోహన్. పలుమార్లు జైలులో అస్వస్థతకు కూడా గురయ్యారు. అయితే బెయిల్ పై బయటకు వచ్చిన ఆయన అనారోగ్యానికి గురి కావడంతో కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకున్నారు. ఇటీవల రాజకీయ పరామర్శలు చేస్తున్నారు. పొలిటికల్ గా యాక్టివ్ అవుతున్నారు.అయితే ఇప్పుడు మరోసారి వల్లభనేని వంశీ అరెస్ట్ జరుగుతుందని ప్రచారం నడిచింది. కూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో తెలుగుదేశం పార్టీ ఒక నిరసన కార్యక్రమం చేసింది.

వల్లభనేని వంశీ మోహన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన ఓ టిడిపి కార్యకర్తపై అనుచరులతో దాడి చేయించారన్నది ఆయనపై వచ్చిన అభియోగం. ఎప్పుడో నెలల కిందట వచ్చిన ఫిర్యాదు పై ఇప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణకు సిద్ధపడ్డారు. దీంతో వల్లభనేని వంశీ మోహన్ తో పాటు ఆయన అనుచరులు కనిపించకుండా మానేశారు. అప్పటినుంచి వల్లభనేని వంశీ మోహన్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు ప్రచారం జరిగింది.

కానీ ఆయన ముందస్తు బెయిల్ కోసం అలా చేసి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి కేసులు ఎదుర్కొని బెయిల్ పై బయటకు వచ్చాక అంత ఈజీగా మళ్లీ జీవితం ఉండదని చెబుతున్నారు. ఎందుకంటే అంతకు ముందు కేసుల్లో బెయిల్ తీర్పులను ఆధారంగా చేసుకుని న్యాయపరంగా ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. కేవలం కోర్టు నుంచి వచ్చే ఆదేశాల కోసం ఎదురు చూస్తారే తప్ప అజ్ఞాతంలోకి వెళ్లారన్నది మెజారిటీ విశ్లేషకుల అభిప్రాయం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి

సోమవారం,
జూన్,22, 2026
నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY



# బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రూ.5కే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు

**-కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా వాటర్ ప్లాంట్ ప్రారంభం- పేద కుటుంబాలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన నీటి సదుపాయం- బాల బ్రహ్మచారి సేవా కార్యక్రమాన్ని అభినందించిన హన్మంత్ రెడ్డి- పెద్ద ఎత్తున మహిళలు, కాలనీ వాసుల పాల్గొనిక**

బాచుపల్లి, జూన్ 21 (నమస్తే భారత్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో పేద ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కాయిన్ ఆధారిత ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. బాల బ్రహ్మచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ ద్వారా కేవలం రూ. 5 కాయిన్‌తో 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు పొందే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన తాగునీరు అందించే ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో నివసించే కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన బాల బ్రహ్మచారిని ప్రత్యేకంగా అభినందించిన ఆయన, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాల బ్రహ్మచారి, సత్యనారాయణ, నందకుమార్, దుర్గాప్రసాద్, నరేష్, అశోక్‌రావు, నరసింహ, మల్లేష్, రాజు, బాలకృష్ణ, సంతోష్, బద్రీనాథ్,



రాము, శంకర్, సత్యవతి, నాగమణి, రజిత, రాములమ్మ, మంజుల, రోషమ్మ, దీపిక, సంజన తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా రోజువారీ అవసరాలకు స్వచ్ఛమైన నీరు సులభంగా లభించనుండటంతో కాలనీలో ఆనంద వాతావరణం నెలకొంది.

# ఇందిరా మహిళా శక్తి పథకాల ప్రభావం.. కాంగ్రెస్‌లోకి మైనారిటీ మహిళల చేరిక

**-కైసర్ నగర్ మహిళలకు కాంగ్రెస్ గూటిలో స్వాగతం- బాచుపల్లి కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన చేరికల కార్యక్రమం- మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న హన్మంత్ రెడ్డి-సంక్షేమ పథకాల ప్రచారంలో మహిళలు ముందుండాలని పిలుపు**



కుత్బుల్లాపూర్, నమస్తే భారత్ ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కైసర్ నగర్‌కు చెందిన పలువురు మైనారిటీ మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఫరీన్ ఖాన్ ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మహిళలకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదన్నారు. మహిళల సంక్షేమం, స్వయం సాధికారత, ఆర్థిక ప్రగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన మహిళలకు అభినందనలు తెలిపిన హన్మంత్ రెడ్డి, ప్రజాసేవలో చురుకుగా పాల్గొని సమాజాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మహిళల పాత్ర ఎంతో



కీలకమని, పార్టీ బలోపేతానికి కూడా మహిళల సహకారం అవసరమని అన్నారు. కైసర్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ చేరికలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల చేరికతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

# ప్రజల భద్రత కోసం విద్యుత్ లైన్ క్లియరెన్స్ పనులు

**రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత-చెట్ల కొమ్మల తొలగింపు, ప్రమాదాల నివారణే లక్ష్యం-జైరాం నగర్, పైప్‌లైన్ రోడ్ ఫీడర్ల పరిధిలో ప్రభావం-వినియోగదారులు సహకరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ విజ్ఞప్తి**



పేట్ బషీరాబాద్, జూన్ 21 : నమస్తే భరత్;
విద్యుత్ లైన్లకు సమీపంలో పెరిగిన చెట్ల కొమ్మల వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశాలను నివారించడంతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీజీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో సోమవారం (22-06-2026) చెట్ల కొమ్మల తొలగింపు (ట్రీ ప్రూనింగ్), లైన్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న ట్లు అధికారులు తెలిపారు.
ఈ పనుల నిర్వహణ నేపథ్యంలో సంబంధిత ఫీడర్ల పరిధిలో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు11 కేవీ జైరాం నగర్ ఫీడర్ పరిధిలోని జైరాం నగర్, జే.కే. నగర్, రుక్మిణి ఎస్టేట్స్, శ్రీకృష్ణ నగర్, గణేష్ కాలనీ ప్రాంతాల్లో
విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు11 కేవీ పైప్‌లైన్ రోడ్ ఫీడర్ పరిధిలోని పైప్‌లైన్ రోడ్ ప్రాంతం, జీడిమెట్ల ఎస్సీ కాలనీ, జెడ్ఆర్ ఏజెడ్ ఇన్‌ఫ్రా, శ్వేత ఆర్యన్ అపార్ట్‌మెంట్స్, సీఎంఆర్ స్కూల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడనుంది. వినియోగదారులు ఈ తాత్కాలిక అసౌకర్యాన్ని అర్థం చేసుకుని సహకరించాలని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు కోరారు.

# సంఘటన్ సృజన్ అభియాన్‌తో పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం

**- గాంధీభవన్‌లో పార్లమెంట్ కోఆర్డినేటర్ల సమావేశం- సిర్, బీఎల్‌ఏల శిక్షణపై నేతలకు దిశానిర్దేశం- కరీంనగర్ పార్లమెంట్ కార్యకలాపాలపై నివేదిక సమర్పించిన కూన శ్రీశైలం గౌడ్-సంస్థాగత నిర్మాణం, ఓటరు నమోదు కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్ష**





హైదరాబాద్, జూన్ 21 (నమస్తే భారత్): కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, సిర్ (ూ×=) కార్యక్రమం సమర్థ అమలు, బూత్ స్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ లక్ష్యంగా గాంధీభవన్‌లో ఆదివారం పార్లమెంట్ కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు.
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ సిర్ కార్యక్రమం, ఓటరు మ్యాపింగ్, బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) బాధ్యతలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై పార్లమెంట్ కోఆర్డినేటర్లకు మార్గనిర్దేశం చేశారు.
ప్రతి బూత్‌లో పార్టీ యంత్రాంగం చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఓటరు జాబితాల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాల్లో బీఎల్‌ఏలు సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులందరికీ ఓటరు హక్కు కల్పించే దిశగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నేతలు సూచించారు. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నుంచే కృషి ప్రారంభమవ్వాలని పేర్కొన్నారు.
అనంతరం కూన శ్రీశైలం గౌడ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిర్ కార్యక్రమం, బీఎల్‌ఏల శిక్షణ, పార్టీ సంస్థాగత నిర్మాణానికి సంబంధించిన పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించారు. మండల, డివిజన్, మున్సిపల్ వార్డు, గ్రామ కమిటీల నియామకాలు, పార్టీ విస్తరణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి కార్యకలాపాలపై వివరించారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, సురేష్ షెట్కర్, రఘురామిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందే సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో రేన్‌వాటర్ లైన్ పనుల పరిశీలన- సాటిలైట్ టౌన్‌షిప్ వాసుల సమస్యలపై ఆరా- రుక్మిణి ఎస్టేట్స్‌లో కమిటీ హాల్ నిర్మాణ పనుల తనిఖీ- మంజీరా నీటి సమస్యతో పాటు కాలనీ సమస్యల పరిష్కారానికి అధికారులకు సూచనలు**

పేట్ బషీరాబాద్, జూన్ 21 ( నమస్తే భరత్ ):కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పేట్ బషీరాబాద్, కుత్బుల్లాపూర్ డివిజన్లలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. పేట్ బషీరాబాద్ డివిజన్ పరిధిలోని జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో ఉన్న సాటిలైట్ టౌన్‌షిప్ అపార్ట్‌మెంట్‌ను సందర్శించిన భరత్ సింహ రెడ్డి, అపార్ట్‌మెంట్ వాసులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అక్కడ నూతనంగా నిర్మిస్తున్న రేన్‌వాటర్ లైన్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి, అపార్ట్‌మెంట్ వాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డితో పాటు ప్రవీణ్, సరస్వతి, హన్మంతరావు, మహేష్ రెడ్డి, నేగి, శ్రీనివాస్ రాజు, వినోద్ గౌడ్, జనార్దన్, పాపయ్య దొర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని రుక్మిణి ఎస్టేట్స్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న కమిటీ హాల్



పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి మంజీరా తాగునీటి సరఫరా సమస్యతో పాటు ఇతర స్థానిక సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శేఖర్‌తో పాటు ప్రేమానందం, నర్సింహ, నాగరాజు, ప్రదీప్, అశోక్, వీరబాబు, రాజేష్, రాజేంద్ర, రామచంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ దిక్సూచికి ఘన నివాళులు

**-వర్ధంతి సందర్భంగా జయశంకర్ చౌరస్తాలో విగ్రహానికి పూలమాలలు- ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన సేవలు చిరస్మరణీయం- మూడు దశల ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించిన మహోన్నత నాయకుడు- జయశంకర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉంటామని బీఆర్ఎస్ నాయకుల స్పష్టం**




పేట్ బషీరాబాద్, నమస్తే భారత్: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను జీవితాంతం ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత ఉద్యమ నేత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పేట్ బషీరాబాద్ డివిజన్ పరిధిలోని జయశంకర్ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 1952 నుంచి తన చివరి శ్వాస వరకు ప్రొఫెసర్ జయశంకర్ నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం మూడు దశల్లో సాగిన ప్రతి సందర్భంలోనూ ఆయన కీలక పాత్ర పోషించి ఉద్యమానికి సిద్ధాంతపరమైన బలాన్ని అందించారని గుర్తుచేశారు. ప్రొఫెసర్ జయశంకర్ ప్రముఖ విద్యావేత్తగా, సామాజికవేత్తగా, కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందించారని తెలిపారు. ముఖ్యంగా నదీ జలాల అసమాన పంపిణీ, ఉద్యోగాలు, వనరుల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలపై ఆయన చేసిన లోతైన అధ్యయనాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్‌తో పాటు పార్టీ నాయకులు యాదగిరి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు కిషోర్ చారి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకుడు నజీర్, రాకేష్, దిలీప్, ఉమేష్, ఆంజనేయులు, రమణారెడ్డి, వెంకటేష్, అజయ్, రవీందర్, గంగాధర్, సతీష్, పోచయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఆయుధంగా ఇరాన్




న్యూఢిల్లీ, : ఇరాన్?అమెరికా మధ్య ఉద్రిక్తతలు హోర్మూజ్ జలసంధిని కేంద్రంగా మరింత తీవ్రస్థితి చేరాయి. చర్చలు విఫలమై, ఇరాన్ జలసంధిపై కఠిన నియంత్రణలు ప్రకటించింది. ప్రపంచ చమురు సరఫరా దీనిపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఆర్థిక ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో 21 గంటల సుదీర్ఘ చర్చలు ఫలితం లేకుండా ముగిశాయి. అమెరికా అణు కార్యక్రమంపై 20 సంవత్సరాల ఫ్రీజ్, జలసంధి దిగ్బంధనాలు డిమాండ్ చేసింది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా 'అర్థరహిత' షరతులను తిరస్కరించి, యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఇరాన్‌కు బ్యాడ్ న్యూస్' అని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్ శత్రుదేశా లకు షాక్ ఇచ్చేలా కొత్త చట్టం రూపొందిస్తోంది.ఇరాన్ సంయుక్త సైనిక ఆదేశాలు జలసంధిని తమ పూర్తి నియంత్రణలో ఉంచుతూ, అమెరికా దిగ్బంధనాలు ఉన్నంతకాలం రవాణాను అడ్డుకుంటామని ప్రకటించాయి. గత 50 రోజుల్లో ఆంక్షలు విధించి, ఇటీవల తెరిచినా మళ్లీ మూసివేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు ఇది కీల యం. తాజా నిర్ణయంతో చమురు రవాణాకు బ్రేక్ పడింది. పార్లమెంటరీ సివిల్ ఇంజనీరింగ్ కమిటీ ఛైర్మన్ మహమ్మద్ రెజాయ్ కూచీ ప్రకటించిన ముసాయిదా తుది దశలో ఉంది. ఇజ్రాయెల్ సంబంధ నౌకలపై పూర్తి నిషేధం ఉంటుంది. హర్మూజ్ దాటాలంటే జాతీయ భద్రతా మండలి అనుమతి తీసుకోవాలి. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించకపోతే ప్రయాణానికి అనుమతి ఇవ్వరు. రవాణా రుసుము ఇరాన్ కరెన్సీలో మాత్రమే చెల్లించాలి. భద్రత 'ఉచితం కాదు' అని ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరిఫ్ హెచ్చరించారు. ఇరాన్ నిర్ణయంతో చమురు ధరలు 100-120 డాలర్ల వరకు రికార్డు స్థాయిలు చేరాయి. హర్మూజ్ మూసివేతతో 20 శాతానికిపైగా పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి 40 శాతంపైగా చమురు దిగుమతి చేసుకునే భారత్ ఇప్పుడు ఆఫ్రికా, రష్యా నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. మరోవైపు పెట్రోల్?డీజిల్ ధరలు 15?90 శాతం పెరిగాయి. చైనా, యూరప్‌లో కూడా ఇంధన కొరత పెరుగుతోంది. మధ్యప్రాచ్య చమురుపై ఆధారపడి ఉన్న భారత్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశతాకు తాయి.ఇరాన్ ప్రతీకార వ్యూహం ఆర్థిక ఆయుధంగా మారింది. చర్చలు ఆలస్యమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు. భారత్ వంటి దేశాలు వైవిధ్యమైన మూలాలపై దృష్టి పెట్టాలి.

# జాతీయ పార్టీగా జనసేన




అనంతపురం, : జనసేన నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. ఏపీలో కూటమిపరంగా అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ విస్తరణ పై సరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కేరళలో ఆ పార్టీ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్రంలో వివిధ పార్టీల్లోని 200 మంది నేతలు జనసేనలో చేరడంవిశేషం. జనసేన అగ్ర నేతలు నాగబాబు, రామ్ తాళ్లూరిల సమక్షంలో కేరళలో జనసేనలో చేరికలు పెరిగాయి. కేరళ నుంచి వచ్చిన వినతులు మేరకు పవన్ కళ్యాణ్ స్పందించారు. నాగబాబు తో పాటు రామ్ తాల్లూరిలను అక్కడకు పంపించారు. అయితే కేరళలో పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరడం ఇప్పుడు కొత్త ప్రచారానికి తెరతీసింది. ముున్ముందు జనసేన రాజకీయ ప్రయాణం దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించనుందని అర్థమవుతోంది.పవన్ కళ్యాణ్ఎప్పుడు దూకుడు రాజకీయాలు చేయలేదు. జనసేన పరంగా దూకుడుగా అడుగులు వేయలేదు. ముందుగా ఏపీలో సిద్ధాంత పరంగా ముందుకు వెళ్లారు. సంప్రదాయ రాజకీయ పార్టీ మాదిరిగా అస్సలు వ్యవహరించలేదు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితేనే కొనసా గాలని కుండబద్దలు కొట్టారు నాయకులకు. భారతీయ జనతా పార్టీ మాదిరిగా సిద్ధాంత పరంగా జనసేనను నిలబెట్టాలని చూశారు. ఈ క్రమంలో హిందుత్వ వాదాన్ని, సనాతన ధర్మ పరిరక్షణ నినాదాన్ని అందుకున్నారు. దీని వెనుక లోతైన వ్యూహం ఉంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. కానీ బలమైన సిద్ధాం తాల నడుమ అవి కొనసాగుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ సిద్ధాం తం పూర్తిగా రాజకీయ పార్టీలను కబలించింది. అటువంటి చోట సనాతన ధర్మం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి.. ఒక వర్గం ప్రజలను ఆకర్షించగలిగారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే వ్యూహంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పుడు కేరళలో అది వర్క్ అవుట్ అయ్యేలా కనిపిస్తోంది.పెద్ద ఎత్తున నేతల చేరిక.. తిరువనంతపురంలోజరిగిన జనసేన సమావేశంలో చాలామంది నేతలు ఆపార్టీలో చేరారు.ప్రధానంగా నేషనల్‌లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయలోక్ దళ్, కాంగ్రెస్ పార్టీలనుంచి 200మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అయితే ఈ ఉత్సాహం చూస్తుంటే మాత్రం తదుపరి లక్ష్యంగా కర్ణాటక పై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. క్రమేపి తమిళనాడుతో పాటు తెలంగాణలో కూడా పార్టీ విస్తరించి.. జాతీయ పార్టీగా అవతరించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పవన్ కళ్యాణ్ భావజాలం భాషలతో పాటు ప్రాంతాలకు అతీతంగా దేశస్థా యిలో ప్రజలను ఆకట్టుకుంటుందని జనసేన నాయకత్వం భావిస్తోంది.

## మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి) కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల గురించి సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ ని కలిసి సమస్య వివరించడం వినతి పత్రము అందజేయడం జరిగింది. వారి సమస్యలు పూర్తిగా విన్న సైబరాబాద్ కమిషనర్ సృజన , జరిమానాలు వేసిన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయి లో పరిష్కరిస్తానని తెలియజేశారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర వివరాలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ అందజేశారు.

ఈ పనులు ప్రభుత్వం నుండి మంజూరైనప్పటికీ ప్రస్తుతం కొన్ని టెండర్ ప్రక్రియలో ఆగిపోవడం జరిగిందని వాటిని వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కమిషనర్ కోరారు, కమిషనర్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోటే శ్రీనివాస యాదవ్ అరువ వెంకట్, సాయికిరణ్, గోపాల్ రెడ్డి గుమస్తా మధుసూదన్ , వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, సభ్యులు ఎన్ వి రెడ్డి, కృష్ణ, రాము, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యక్తిగత దూషణల్లో నేతలు..
# ఇద్దరూ... ఇద్దరే

హైదరాబాద్, : దేశంలో మిగతా రాష్ట్రాలు వేరు.. తెలంగాణ వేరు. తెలంగాణ ఉత్తి పుణ్యానికి రాలేదు. బలిదానాల మీద.. ఆత్మ త్యాగాల మీద వచ్చింది. ఆశయాల సాధన మీద ఏర్పడింది. అందుకే తెలం గాణ అంటే ఒక పౌరుషం.. తెలంగాణ అంటే బలమైన ఆశయం. తెలంగాణ అంటే పిడికిలి బిగించిన నినాదం. సబ్బండవర్ణాలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు, నిరసనలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పులు చేస్తేనే తెలంగాణ ఏర్పడింది. అతడు తెలంగాణలో నాయ కులు మాట్లాడుతున్న మాటలు చూస్తే జాలి కలుగుతుంది. తెలంగాణలో మర్యాదలు ఎక్కువ గా ఉంటాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగితే తిట్టే తిట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఉద్య మాన్ని శంకించిన వారికి.. తెలంగాణ ప్రజల నుంచి ఎటువంటి తిట్లు ఎదురయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి సామాజిక ఐక్యత తెలంగాణ ప్రజల్లో నిండి ఉంది కాబట్టి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. అంతటి గొప్ప విద్వత్తు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు బాధ కలిగిస్తున్నాయి. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయిరాజకీయ నాయకులు అధికారం కోసం మాత్రమే పాకులాడుతారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది వట్టి మాటలు మాత్రమే. ఏదో రాజకీయ ప్రాపకం కోసం అభివృద్ధి చేసినట్టు.. సంక్షేమానికి పాటుపడినట్టు కలరింగ్ ఇస్తుంటారు. లేకపోతే 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడింది. కెసిఆర్ దిగిపో యే నాటికి రెవెన్యూ లోటుకు దిగజారింది. రేవంత్ పరిపాలనలో కూడా అదే సన్నివేశం కొనసాగుతోంది.. పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కనీసం రిటైర్మెంట్ బెనిఫిషరీస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది.దీనిని బట్టి తెలంగాణఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ ఇలా కావడా నికి ముమ్మాటికి రాజకీయ నాయకులు కారణం. అధికారకాంక్ష.. స్వార్థం.. భారీగా వెనకేసుకోవడం వంటివాటి వల్ల తెలంగాణ సంపద మొత్తం రాజకీయ నాయకుల జేబుల్లోకి చేరిపోయింది. మద్యం అమ్మకాలు గనుక లేకుంటే తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిష్ఠూరంగా ఉన్నప్పటికీ ఇదే కఠిన నిజం. రాజకీయ నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు పోతోంది అని చెప్పుకున్నాం కదా.. అది మరోసారి నిరూపితమైంది.. జగిత్యాల సభలో కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఏం బీమారివచ్చింది? ఏ మాయ రోగం? లాగులు ఇడ్చి కొట్టాలే.. నన్ను ఏం చేస్తావ్ నా కొడకా..ఇటువంటి మాటలుమాట్లాడారు. వాస్తవానికి కెసిఆర్ నుంచి ఇంతకంటే గొప్పగా తెలంగాణ సమాజం ఆశించదు. కఠినంగా ఉన్నప్పటికీ ఇదే నిజం. కాకపోతే కెసిఆర్ గత సంభాషణలు ఉంటే ఆయన నోటి నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం అవుతుంది.రేవంత్ రెడ్డి కూడా ఇందులో తక్కువ తినలేదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో జీవన్ రెడ్డిని గట్టిగానే తిట్టారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది.. జీవన్ రెడ్డి ఎందుకు మోసం చేశాడు.. అనే అంశాలపై రేవంత్ లోతుగానే మాట్లాడారు. కొన్ని సందర్భాలలో రేవంత్ రెడ్డి అదుపుతప్పారు. ఇక కెసిఆర్ ను కూడా అదే స్థాయిలో విమర్శించారు. కర్కోటకుడు అని సంబోధించారు. పాపాత్ముడు అంటూ మండిపడ్డారు.. కెసిఆర్ లాంటి ద్రోహిని వదిలిపెట్టే సవాల్ లేదని శపథం చేశారు.అటు రేవంత్ రెడ్డి, ఇటు కెసిఆర్ సీనియర్ నాయకులు. తిట్టుకుంటూనే రాజకీయమంటే అంతకు మించిన మూర్ఖత్వం ఉండదు. వ్యక్తిగత కోపాలు ఉంటే నేరుగా తేల్చుకోవాలి. అలాకాకుండా జనాన్ని ప్రభావితం చేసే విధంగా మాట్లాడటం ఎందుకు. రాజకీయాలు అంటే వ్యక్తిగత కక్షలకు వేదికలు కావు కదా.. విధానాలపరంగా నేతలను విమర్శించాలి. ఏవైనా తప్పులు చేస్తే ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలకు ఈడ్చాలి. అలా కాకుండా ఇలా తిట్టుకోవడం.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఎటువంటి రాజకీయాలకు నిదర్శనమో కెసిఆర్, రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇటువంటి రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది.

## తెలంగాణలో పెరగనున్న..
# భూముల ధరలు




హైదరాబాద్, : తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది.తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చేఅవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్‌విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వలెక్కల్లో రూ. 20లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది.ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచనున్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ.2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగిన ప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదిం చారు. ఎస్ఎఫ్‌టీకి రూ.7 వేలుఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.


# కాంగ్రెస్ కంచుకోటలకు బీటలు




చెన్నై, : దాదాపు 50 ఏళ్ల తర్వాత లోక్‌సభ సీట్లు పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓ ప్రయత్నం చేసింది. ప్రస్తుతం ఉన్న 543 సీట్లు 1977లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినవే. తాజాగా 130వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ స్థానాలు 816కు పెంచడంతోపాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. అయితే ఈ బిల్లే కాంగ్రెస్‌ను భయపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. ఉనికే లేకుండా పోతుంది. అందుకే కాంగ్రెస్ విపక్షాలను ఏకం చేసి బిల్లును వ్యతిరేకించడంలో విజయవంతమైంది.కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో తమ అనుకూలంగా సీట్లను ఒకటిగా, వ్యతిరేక సీట్లలో ఓటర్లను విభజించి అనుకూల నియోజకవర్గాల్లో కలపడం వంటివి చేసింది. తెలంగాణలో 2008?09 పునర్విభజనలో హైదరాబాద్ హిందూ ఓటర్లను ముస్లిం బలమైన పాత్‌బస్తీ ప్రాంతాలతో కలిపి బీఆర్ఎస్, బీజేపీ ఓట్లు చీలేలా చేశారు. 90 కి.మీ. దూరంలోని తాండూర్‌ను హైదరాబాద్ లోక్‌సభ సీటుకు చేర్చి ముస్లిం ఓట్లు బలోపేతం చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళలో ముస్లిం, క్రిస్టియన్ ప్రాంతాల సీట్లు పెంచి, హిందూ బలమైన దక్షిణ కేరళలో సీట్లు తగ్గించారు. శ్రీరంగంలో బ్రాహ్మణులు గెలవకుండా విభజనలు చేశారని విమర్శలు వచ్చాయి.కేంద్రం మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ బిల్లు?2026, మహిళా రిజర్వేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల పెంపు. లోక్‌సభ సీట్లు 50 శాతం పెంచి 816?850కి, రాష్ట్రాలకు 815, యూటీలకు 35 సీట్లు కేటాయించాలని ప్రతిపాదన. జూన్‌లో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, 84వ సవరణను సవరించి 2011 డేటాతో ముందుకు సాగాలని భావించింది. ఉత్తరప్రదేశ్‌కు 120 సీట్లు, తెలంగాణకు 25, ఏపీకు 38 సీట్లు పెరిగే అవకాశం. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సీట్లు పెరుగుతాయని కేంద్రం చెబుతోంది.తెలంగాణ, తమిళనాడు సీఎంలు దక్షిణ రాష్ట్రాల సమతౌల్యం దెబ్బతింటుందని వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎంపీ సీట్ల మార్పు ఎమ్మెల్యే సీట్లను కూడా ప్రభావితం చేస్తుంది. ఉత్తర రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెరిగి దక్షిణానికి నష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.ఇండియా కూటమి, మల్లికార్జున్‌ఖర్గే దీన్ని రాజ్యాంగ విరుద్ధ కుట్రగా, బీజేపీ హైజాక్ ప్రయత్నంగా విమర్శిస్తోంది. కేసీ వేణుగోపాల్ బిల్లును వెనక్కి తీసుకోవాలనిడిమాండ్ చేశారు. బీజేపీ ఇది జన హితమని, కాంగ్రెస్ గతంలో జనాభా ఆధారం మర్చినట్టు ఆరోపిస్తోంది.ఈ పునర్విభజన దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. కాంగ్రెస్ తన 'కంచు కోటలు' కుప్పకూలుతాయని భయపడుతోంది. బీజేపీ మతపరమైన పోలరైజేషన్‌కు అనుకూలంగా మారవచ్చని ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్ ఎన్నికల్లో పార్టీల బలాలు పూర్తిగా మారే అవకాశం ఉంది.

## అప్పు ఇచ్చేందుకు నిరాకరణ..
# రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని హత్య చేసిన దంపతులు

న్యూఢిల్లీ: రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని దంపతులు అప్పు అడిగారు. ఆయన నిరాకరించడంతో ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని హత్య చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు భార్యాభర్తలను అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. 63 ఏళ్ల మాధో రామ్ రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగి. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడుతో కలిసి మందిర్ మార్గ్ ప్రాంతంలో నివసిస్తున్నాడు.కాగా, ఏప్రిల్ 19 ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటి మొదటి అంతస్తులోని గదిలో కత్తి గాయాలతో మాధో రామ్ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు మాధో రామ్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. అలాగే స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. దీంతో భార్యాభర్తలైన ఆజాద్ అలియాస్ జాజు, అతడి భార్య రుబీనాను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కాగా, గోల్ మార్కెట్ ప్రాంతంలో నివసించే ఆజాద్ టైలర్‌గా పనిచేస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఆదివారం సాయంత్రం అప్పు కోసం మాధో రామ్‌ను అతడు కలిసినట్లు చెప్పారు. డబ్బు ఇచ్చేందుకు నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆజాద్ కత్తితో మాధో రామ్‌ను పొడిచి పారిపోయినట్లు వివరించారు. అయితే ఆజాద్ భార్య రుబీనా సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రక్తం మరకలు ఉన్న ఆజాద్ దుస్తులను ఆమె ఉతికిందని చెప్పారు. నేరాన్ని అంగీకరించిన నిందితులైన భార్యాభర్తలను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



# ఇంకెంతకాలం?.. పరసేవా పరాయణత్వం!



పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో చోటుచేసుకున్న పరిణామాలను నిశితంగా కాకపోయినా మోస్తరు పరిశీలించినా చిన్నప్పుడు బడిలో చదువుకున్న స్వయం పోషకాలకు, పరపోషకాలకు మధ్య ఉండే తేడా గుర్తుకొచ్చింది. ఆత్మగౌరవం, అస్తిత్వం, రాజకీయార్థకోణంలో చూసినప్పుడు ఈ తేడా మరింత స్పష్టమైంది. అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విషయంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో జరిగిన చర్చ అనేకానేక ఆసక్తికరమైన అంశాలను మళీ ?లమళ్లీ తెరముందుకు తెచ్చేందుకు పార్లమెంట్ సభ్యులు, కేంద్రమంత్రులు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రాల ప్రజల ఆకాంక్షల ప్రతినిధులుగా ప్రతినిధులుగా వ్యవహరించిన తీరుకు ముచ్చటేసింది. అదే తెలంగాణ నుంచి లోక్‌సభలో ప్రతినిధులుగా ఉన్న మననాయకుల తీరును చూసినపుడు ఒళ్లంతా అగ్నిగోళమైంది. పార్లమెంట్‌లో బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంపై అక్కసు వెళ్లగక్కినప్పుడు..అధికార అహంకారంతో విర్రవీగుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని, అస్తిత్వాన్ని కించపరుస్తున్నప్పుడు ఒళ్లు రోమాంచితమైంది. ఆరు దశాబ్దాల అవిరామ ఆకాంక్షను లెక్కలేకుండా ఎగతాళి చేస్తున్నప్పుడు.. వందల మంది తెలంగాణ బిడ్డల ఆత్మబలిదానాలు, తెలంగాణ సమాజ వీరోచిత పోరాటాలను నెమరువేసుకుంటూ 13 ఏండ్లుగా స్వరాష్ట్రంలో భానూదయాన్ని స్వాగతిస్తున్న ఈ గడ్డపై పార్లమెంట్ సాక్షిగా 'సూర్య'గ్రహణం పట్టినందుకు మనుసు కలికలి అయింది. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యం 'దేశ విభజనను చేసినట్టే... ఇండియా-పాకిస్థాన్‌ను విడగొట్టినట్టే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను విడగొట్టింది' అనే పోలికతో విషం చిమ్ముతున్నప్పుడు గురజాడ గిరీశం గుర్తుకొచ్చిందు. అవును. నిజం. గిరీశం పాత్రధారి 'మనవాళ్లు ఉత్త......!' అన్నట్టే అనిపించింది. తెలంగాణపై అంతలేసి మాటలు అంటున్నా సభలో ఉండి కూడా ఉత్సవ విగ్రహాల కన్నా హీనంగా ప్రాణంలేని బొమ్మలుగా పడిఉన్న తీరును చూస్తే జాలికలిగింది. అయితే, అన్నింట్లో అదే ఉత్సవ విగ్రహ పాత్ర పోషిస్తున్నారా? అంటే అలా పోషించటంలేదు. తెలంగాణ నుంచి గెలిచినవాళ్లకు సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువ అని తమ నాయకుడిని పల్లెత్తు మాటంటే ఊరుకునేది లేదు అన్నట్టు వ్యవహరించిన తీరుకు ఒళ్లంతా జ్వాలాతీతమైంది. తెలంగాణ ఏర్పాటుపై విషం కక్కటానికి కొద్ది నిమిషాల ముందే అదే బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తమిళులు 'భాషావేర్పాటువాదులు' అని వ్యాఖ్యానించారు. అంతే, సభ ఒక్కసారిగా వేడెక్కింది. డీఎంకే, కాంగ్రెస్, వీసీకే ఇలా పార్టీలకు అతీతంగా తమిళ ఎంపీలంతా లేచి అభ్యంతర పెట్టారు. తక్షణమే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్ధాంతాలు, వైఖరులు ఏ పార్టీవి వారివే అయినా తాము తమిళగడ్డ బిడ్డలమని, తమ ప్రజల ఆకాంక్షలకు ఎవరు విఘాతం కలిగించినా సహించమని చెప్పిన తీరుకు సెల్యూట్ చెప్పాలని అనిపించింది. డీఎంకే ఎంపీలు రాజా, కనిమొళి, జమ్ము కశ్మీర్ ఎంపీ అల్తాఫ్ అహ్మద్ నియోజకవర్గాల పునర్విభజన కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను, వారి ఆత్మను ఎట్లా విచ్ఛిన్నం చేసిందీ కండ్లకు కట్టినప్పుడు, పంజాబ్ ఎంపీ ప్రొఫెసర్ హర్‌సిమ్రత్ కౌర్ బాదల్, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కోల్‌కతా కాళీమాతగా ఎట్లా బెంగాల్‌ను కాపాడుతుంది? అని వివరిస్తూ తమతమ ప్రాంతాల ప్రతిష్టను పార్టీలకు అతీతంగా ఆకాశానికి ఎత్తిన వైనానికి, తెలంగాణ చెట్టు పేరు చెప్పుకొని గెలిచి ఆ చెట్టుకొమ్మనే కాదు ఆ చెట్టు వేర్లనే తెగనరికేందుకు సాహసిస్తుంటే మన పుణ్యాత్ములు చేవహీనమై, అచేతన జీవుల్లా పడి ఉన్నారేంది? అనే వేదన వెంటాడింది. తెలంగాణ ఆత్మ నిండినవాళ్లు, తెలంగాణ ఉద్యమంలో మమేకమైనవాళ్లు.. తెలంగాణ సాంస్కృతిక వారధులుగా ఉన్నవాళ్లు సభలో లేకపోవటం తెలంగాణకు జరిగిన తీరని అన్యాయమే. అదే సమయంలో సభానాయకుడిపై విపక్ష సభ్యుడు ఒక్క మాటంటే మాత్రం ఉన్నపళంగా లేచి ఆక్షేపించటం, ఆగ్రహం వ్యక్తం చేయటమే కాదు ఏకంగా క్షమాపణ చెప్పాల్సిందేనని తెలంగాణ ఓట్లతో గెలిచిన కేంద్రమంత్రి పట్టుబట్టారు. అంటే ఆ నాయకుడికి నాయకుడే ప్రధానం కానీ, తెలంగాణ అప్రధానం. ఈ క్రమంలోనే తెలంగాణ ఆత్మగౌరవ, అస్తిత్వ అంశతోనే కాదు రాజకీయార్థిక కోణంలోనూ స్వయంపోషకులే కావాలి. అంతేకాదు పరపోషక.. పరకీర్తి పరులు ఎందరున్నా తెలంగాణకు అపకీర్తే.

## పోయిన ఫోన్లు తిరిగి అందజేసిన ముదిగొండ పోలీసులు



ముదిగొండ, : ముదిగొండ మండల కేంద్రానికి వివిధ ప్రాంతాల నుండి పనుల నిమిత్తం వచ్చిన నలుగురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా, ముదిగొండ పోలీసులు చురుకుగా స్పందించి వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ముదిగొండకు చెందిన శివరాత్రి రామయ్య, పిప్పలల కృష్ణ, నేలకొండ పల్లికి చెందిన రాజపుత్ర సాయి, ఆలకుంట నవీన్ తమ మొబైల్ ఫోన్లు కోల్పోయినట్లు ఇచ్చిన ఫిర్యాదులను పోలీసులు సీఐఇఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. అనంతరం సాంకేతిక సహాయంతో శోధనచేపట్టి ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.సుమారు రూ. 71,000 విలువైన నాలుగు మొబైల్ ఫోన్లను ముదిగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) మురళి గురువారం బాధితులకు అందజేశారు

## ఆలయాలకు రక్షణ కరువు...

హైదరాబాద్, : దేవాలయాల్లో దేవుడి సొమ్ముకు రక్షణ కరువవుతోంది. భక్తులు భక్తితో సమర్పించే కానుకలు, ఆభరణాల నిర్వహణలో కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో విలువైన సొత్తు మాయమవుతోంది. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయాల వరకు పలుచోట్ల అవకతవకలు వెలుగుచూశాయి. చిక్కడ పల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఒక భక్తుడు అందజేసిన 2.30 కిలోల వెండి కిరీటానికి సంబంధించి రశీదు ఇవ్వకపోవడం, దానిని రిపేరు పేరుతో బయటకు పంపి నాలుగేళ్లు దాటినా తిరిగి తీసుకురాక పోవడం చర్చనీయాంశమైంది. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు విచారణ జరిపి, ఈఓ కె.రామాంజనేయులుపై సస్పెన్షన్‌వేటువేశారు. అలాగే బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో బంగారు, వెండి వస్తువుల నిర్వహణలో లోపాలు, బయోమెట్రిక్ హాజరు పాటించకపోవడం వంటి కారణాలతోఈఓ శేఖర్, సూపరిం టెండెంట్ హైమావతిలను అధికారులు సస్పెండ్ చేశారు.సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో అమ్మవారి ఆభరణాల లెక్కల్లో భారీ తేడాలున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2006 నాటి లెక్కల ప్రకారం ఆలయంలో 5 కిలోల 473 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు ఆభరణాలు ఉండాలి. కానీ 2017లో నాటి ఈఓ స్వాధీనం చేసుకున్న సమయంలో కేవలం 2 కిలోల 132 గ్రాముల 94 మిల్లీగ్రాముల నగలకు సంబంధించిన వివరాలే ఉన్నట్లు సమాచారం. మిగిలినఆభరణాల ఆచూకీపై స్పష్టత లేదని ఆలయ పరిరక్షణ సంస్థ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.చాలాచోట్ల భక్తులు సమర్పించే వెండి, బంగారు కానుకలకు ఆలయ అధికారులు రశీదులు ఇవ్వడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. దులపల్లికి చెందిన సుజాత అనే భక్తురా లు సంతోషీమాత ఆలయానికి వివిధ సందర్భాల్లో సమర్పించిన 1.25 కేజీల వెండి, 21 గ్రాముల నెక్లెస్, బంగారు ముక్కుపుడకలకు రశీదు అడిగితే అధికారులు దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆలయ ఆభరణాల రక్షణ కోసం దేవాదాయ శాఖ కొన్ని స్పష్టమైన నిబంధనలు విధించింది.భక్తులు సమర్పించే బంగారానికి తూకం వేసిన రశీదు, ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఇవ్వాలి.ప్రతి వస్తువును ఫోటో తీసి, దాని వివరాలను ఈఓ, ఛైర్మన్, అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాలకు పంపాలి.నిత్యం అలంకరించే నగలు అర్చకుల ఆధీనంలో ఉండాలి, మిగిలినవి బ్యాంకు లాకర్లలో భద్రపరచాలి

## ఫ్యాన్ కిందకు ఆమంచి



ఒంగోలు, : వచ్చే ఎన్నికలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యలాంటివి. ఎట్టి పరిస్థితుల్లో గెలవాల్సిన ఎన్నికలు అవి. లేకుంటే పార్టీకి గడ్డు పరిస్థితులు తప్పవు. అందుకే సర్వశక్తులు ఒడ్డుతోంది ఆ పార్టీ. గెలుపు గుర్రాలను వెతికే పనిలో పడ్డారు జగన్మోహన్ రెడ్డి. గెలిచే ఛాన్స్ ఉన్నవారికి టికెట్లు ఇవ్వాలని భావిస్తున్నారు. అందుకే వివిధ కారణాలతో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వారికి తిరిగి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఓ నేతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ప్రకాశం జిల్లా రాజకీయాలు ఒక మలుపు తిరిగినట్టే. ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కు వైసీపీలోకి వచ్చేందుకు అనుమతి లభించినట్లు ప్రచారం నడుస్తోంది. అందుకే ఆయన చీరాల నియోజకవర్గంలో పర్యటనలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.ప్రకాశం జిల్లా రాజకీయాల్లో ఆమంచి కృష్ణమోహన్ ది ప్రత్యేక స్థానం. ఒక సాధారణ జడ్పిటిసిగా ఉన్న ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మరోసారి ఇండిపెండెంట్గా పోటీ చేసి ప్రధాన పార్టీ అభ్యర్థులకు ఓడించి మరి ఎమ్మెల్యే అయ్యారు. ప్రధానంగా చీరాల నియోజకవ ర్గంలో ఆమంచి కృష్ణమోహన్ కు పట్టు ఎక్కువ. బలిజ సామాజిక వర్గానికి చెందిన ఆయన జడ్పిటిసిగా తన ప్రస్తానాన్ని ప్రారంభించారు. రోశయ్య ప్రోత్సాహంతో రాజకీయాల్లో రాణించగలిగారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీలోకి.. వైసీపీ నుంచి టీడీపీలోకి.. అక్కడ నుంచి కాంగ్రెస్లో చేరారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. షర్మిల పక్కన కనిపించే ఆమం చి కృష్ణమోహన్ ఇటీవల కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరమయ్యారు. తన అనుచరులతో తరచూ చేరాలని నియోజకవర్గంలో పర్యటనలు చేస్తున్నారు.ప్రస్తుతం చీరాల నియోజకవర్గ ఇన్చార్జిగా కరణం బలరాం కుమారుడు వెంకటేష్ ఉన్నారు. అయితే వారు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు చాలా ప్రయత్నాలు చేస్తున్నారు. చీరాల నియోజకవర్గంలో తనకంటూ పట్టు నిలుపుకుంటూ వచ్చారు ఆమంచి కృష్ణమోహన్. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఇండిపెండెం ట్గా పోటీ చేసి గెలిచిన ఆయన తెలుగుదేశం పార్టీ అనుబంధ సభ్యుడిగా కొనసాగారు. 2019 ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే చంద్రబాబు అనూహ్యంగా కరణం బలరామును చీరాల అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జగన్ ప్రభంజనం వీచింది. చీరాలలో మాత్రం టిడిపి అభ్యర్థి కరణం బలరాం గెలిచారు. గెలిచిన కొద్ది రోజులకే ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారు. అప్పటినుంచి కరణం బలరాం వర్సెస్ ఆమంచి కృష్ణమోహన్ అన్నట్టు పరిస్థితి మారింది. ఈ క్రమంలో ఆమంచి కృష్ణమోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కరణం బలరాం చూపు మాతృ పార్టీ వైపు ఉందన్న ప్రచారం ఉంది. అదే జరిగితే చీరాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తప్పేలా లేదు. అందుకే అక్కడ పట్టున్న ఆమంచి కృష్ణమోహన్ ను పార్టీలోకి రప్పించి టికెట్ ఇవ్వాలన్న ఆలోచనలో జగన్ ఉన్నారు. అందుకే పార్టీకి దూరంగా ఉంటున్నారు ఆమంచి. త్వరలో ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్న ప్రచారం సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## కమలంలో జోష్...



విజయవాడ, : జనసేన పార్టీని అన్ని రకాలుగా బలోపేతం చేయాలనే యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇప్పటికే చాలా వరకు పార్టీ కమిటీల ఏర్పాటును పూర్తి చేసిన జనసేన చీఫ్, సభ్యత్వ నమోదును స్పీడప్ చేశారు. 20 లక్షల సభ్యత్వాలు టార్గెట్‌గా సుదీర్ఘంగా డ్రైవ్ చేస్తున్నారు. ఇదే కాకుండా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించేందుకు లీడర్లను సిద్ధం చేశారు. ఇందుకోసం ఎంపిక చేసిన అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. ఇటీవల జనసేన పార్టీపైనా, పవన్ కల్యాణ్ పైనా వస్తున్న కొన్ని విమర్శలను తిప్పికొట్టడంలో స్పోక్స్ పర్సన్స్ పూర్తి స్థాయిలో సక్సెస్ కావట్లేదన్న భావనతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొందరు నేతలు పార్టీ వేదికలపై, టీవీ డిబేట్లు, ప్రెస్‌మీట్లలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి..తలనొప్పులు తెచ్చి పెడుతుండటంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అధికార ప్రతినిధులు పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించాలని..అలా అని లైన్ దాటి మాట్లాడొద్దని డైరెక్షన్స్ ఇచ్చారు పవన్.పార్టీ అధికార ప్రతినిధులకు రెండు రోజుల పాటు ట్రైనింగ్ వర్క్‌షాప్ నిర్వహించింది జనసేన. పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై ఈ శిక్షణ తరగతులు పెట్టారు. ముఖ్యంగా మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనే నైపుణ్యాలను ఈ రెండు రోజుల వారికి శిక్షణ ఇచ్చారు. ఇకపై రెగ్యుల ర్గా వీరంతా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించనున్నారు. ఇటీవలే పార్టీ కార్యవర్గ సమావేశంలో పవన్ కల్యాణ్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఒక్కడినే మాట్లాడాలా? మీరంతా ఉండి ఎందుకు అని ప్రశ్నించడంతో కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే యాక్టివ్ అయ్యారు. అవసరం అయ్యినప్పుడల్లా మాట్లాడుతున్నారు. అయితే చర్చా వేదికల్లోనూ పార్టీ వాయిస్‌ను వినిపించేలా అధికార ప్రతినిధులకు హితబోధ చేశారు.మాట పదునుగా ఉండాలి. బూతులు మాట్లాడొద్దు. మహిళల జోలికి అసలే వెళ్లొద్దు. వ్యక్తిగత అంశాల ముచ్చటే వద్దు. సబ్జెక్ట్ బేస్డ్‌గా కౌంటర్ ఉండాలి. పిన్ టు పిన్ ఇచ్చి పడేయాలంతే అంటూ స్పోక్స్ పర్సన్స్‌కు జనసేన శిక్షణ కార్యక్రమంలో ట్రైనింగ్ ఇచ్చారు. అనవసర విషయాలను ప్రస్తావించి ఇరకాటంలో పడొద్దని..లైన్ దాటి మాట్లాడితే ప్రజల్లో చులకన అవుతామన్న విష యాన్ని మర్చిపోవద్దన్నారు. అలాగని విపక్షం ఏ విమర్శ చేసినా తమకేం పట్టనట్లు ఉంటే కుదరదని తేల్చి చెప్పారు.అధికార ప్రతినిధులు అంటే పార్టీ తరఫున, అధినేత తరఫున గళం వినిపించే బాధ్యత మీపై ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దని గుర్తు చేశారు. ఇలా జనసేన అధికార ప్రతినిధులకు వివిధ అంశాలపై డైరెక్షన్స్ ఇచ్చారు. మీడియా చర్చల్లో బాధ్యతాయుతంగా, సమర్థంగా పాల్గొనేలా స్కిల్స్ పెంచుకో వాలని..పార్టీ భావజాలాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పుకొ చ్చారు. ఇలా అధికార ప్రతినిధులకు శిక్షణ ఇచ్చి మరీ జోష్ పెంచడం వెనుక సేనాని వ్యూహం ఏంటన్నది ఆసక్తికరంగా మారింది.

## ఇంధన భద్రతపై భారత్ దృష్టి

### గ్రీన్ ఉనర్జీ ఉత్పత్తిపై ప్రణాళికలు

న్యూఢిల్లీ, : ఇంధన భద్రతకు భారత్ పెద్ద పీట వేస్తోంది. సబ్సిడీలు ఇచ్చి దేశీయంగా డిమాండ్‌ను పెంచడంపై దృష్టి పెట్టింది. భవిష్యత్ ఇంధనంగా రూపొందనున్న హరిత హైడ్రోజన్ రంగంపై పట్టు సాధించేందుకు చైనా, భారత్‌లు చాలా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. పెద్ద ఎత్తున గ్రీన్ హైడ్రోజన్ అంటే పునర్వినియోగ ఇంధనాన్ని ఉపయోగించడం ద్వారా నీటి ఎలక్ట్రాలసిస్ ద్వారా ఉత్పత్తయ్యే హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించుకునేందుకు ఇరు దేశాలు పెద్ద మొత్తంలో నిధులను ఖర్చు చేస్తున్నాయి. అయితే పారిశ్రా మిక ఆధిపత్యాన్ని నిలుపుకోవడంపై చైనా దృష్టి కేంద్రీకరించగా, పశ్చిమ దేశాల్లో ఈ రంగంలో కొంత స్తబ్దత నెలకొన్న నేపథ్యంలో ఇరు దేశాలు ఈ రంగంలో తమ మార్కెట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయి. ఇందుకు అవసరమైన రాజకీయ సంకల్పం, ఆర్థిక తోడ్పాటు సమకూర్చుకుంటున్నాయి. వాతావరణ కాలుష్యానికి ఇతోధికంగా దోహదపడుతున్న బొగ్గుకు దూరంగా వెళ్లాలని చైనా ప్రయత్నిస్తోంది. ఇందుకోసం 200కోట్ల డాలర్ల ప్రాజెక్టులో భాగమైం ది. భారత్ దాదాపుగా 210కోట్ల డాలర్ల విలువ చేసే సబ్సిడీల తోడ్పాటుతో 2030కల్లా ఏటా 50లక్షల మెట్రిక్ టన్నుల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ప్రస్తుత గ్లోబల్ మార్కెట్‌కు ఐదు రెట్లు ఎక్కువగా వుంది. అప్పటికి చైనా ఉత్పత్తికి దాదాపుగా రెట్టింపని అంచనా వేస్తున్నారు. హించిన దానికన్నా మరింత అధికంగా వ్యయ పరిమితులు నెలకొంటూ వుండడంతో ఈ దశాబ్దం ప్రారంభంలో పెట్టుకున్న గ్రీన్ హైడ్రోజన్ లక్ష్యాలకు దూరంగా పశ్చిమ దేశాలు వెనక్కి మళ్ళుతున్నాయి. అదే సమయంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనా, భారత్‌లు పెద్ద ఎత్తున ఉత్పత్తికి నడుం బిగించాయి. ఈ రంగంలో రెండు దేశాల లక్ష్యాలు వేర్వేరైనా ఇరు దేశాలకు ఉమ్మడిగా వున్నది రాజకీయ సంకల్పం, అధికారం. పెద్ద ఎత్తున తయారుచేయడం ద్వారా వ్యయం తగ్గేలా, డిమాండ్ పెరిగేలా మార్కెట్‌ను ఉనికిలోకి తీసుకురావడంపై దృష్టి పెట్టాయి. ర్గి÷నైరీలు, ఎరువుల ప్లాంట్లు, ఉక్కు తయారీ సంస్థల నుండి హామీలకు సబ్సిడీలను ముడిపెడుతూ ప్రైవేటు పెట్టుబడులను భారత్ రాబడుతోంది. ఇక్కడ ఇంధన భద్రత వుండాలనే భారత్ లక్ష్యం చాలా స్పష్టంగా వుంది. భారత్‌లో హైడ్రోజన్‌ను ప్రధానంగా దిగుమతి చేసుకున్న ఖనిజవాయువు నుండి తయారుచేస్తారు. అయితే పశ్చిమాసియాలో తాజా పరిణామాలతో నేచరల్ గ్యాస్ సరఫరా ఇబ్బందుల్లో పడింది. మరోవైపు చైనా ప్రభుత్వ రంగంలోని దిగ్గజాలను లేదా ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం ద్వారా పెద్ద ఎత్తున పారిశ్రామిక ప్రాజెక్టులకు సిద్ధమవుతోంది. పరిశుద్ధమైన ఇంధనం దిశగా మళ్ళాలని యావత్ పారిశ్రామిక రంగం అడుగులు వేసే తరుణంలో హైడ్రోజన్ ఉత్పత్తిలో తన ఆధిపత్యాన్ని పరిరక్షించుకోవాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది.

## మొక్కజొన్న రైతుల్ని నట్టేట ముంచిన ప్రజాపాలన



నల్లబెల్లి: ప్రజాపాలన పేరుతో రైతులను తీవ్రంగా నష్టపెట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో వరంగల్ మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నసుదర్శన్ రెడ్డి పాల్గొని రైతులకు మద్దతు

**మొక్కజొన్న రైతుల్ని నట్టేట ముంచిన ప్రజాపాలన**

**నల్లబెల్లి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి బీఆర్ఎస్ ధర్నా**


తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై అవగాహన లేని ప్రభుత్వ పాలన వల్లే మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 35 వేల బస్తాలు తరలింపుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, లారీలు సమకూర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత ఇరవై రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరుగుతూ మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఎకరాకు కేవలం 25 క్వింటాళ్ల పంటనే కొనుగోలు చేసి, మిగిలిన సరుకును రైతులు దళారులకు అమ్ముకునేలా ప్రభుత్వం నెట్టేస్తోందని విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన? ఇదేనా రైతు సంక్షేమం? అంటూ ప్రశ్నించారు. వ్యవసాయ రంగంపై అనుభవం లేని రేవంత్ రెడ్డి ప్రభుత్వ అసమర్థతే ఈ పరిస్థితికి కారణమని వ్యాఖ్యానించారు.

## అర్ధరాత్రి కానిస్టేబుల్ వీరంగం.. రెస్టారెంట్ సిబ్బందిపై దాడి..

హైదరాబాద్: విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఓ రెస్టారెంట్ సిబ్బందిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని టోలిచౌకిలో వెలుగుచూసింది. అర్ధరాత్రి విధులు నిర్వరిస్తున్న జ్ఞానేశ్వర్ అనే కానిస్టేబుల్ టోలిచౌకిలో ఉన్న అల్ రికాబ్ మండి రెస్టారెంట్‌ను అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచినందుకు అందులో పని చేస్తున్న సిబ్బందిపై దాడి చేశాడు.

ఓ వ్యక్తిని కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్ లాఠీతో దారుణంగా చితకబాదిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. టోలిచౌకి పోలీసుల వివరాల ప్రకారం ఈ దాడి ఘటన ఏప్రిల్ 21న జరిగింది. హోటల్ నిర్దేశించిన సమయాని కంటే ఎక్కువ సేపు తెరిచి ఉంచడంపై సిబ్బందిని కానిస్టేబుల్ ప్రశ్నించాడు.. దీంతో ఆ వ్యక్తి కానిస్టేబుల్‌ను దూషించాడు.. అందువల్ల కానిస్టేబుల్ సదరు వ్యక్తిని కొట్టాడు, దాడికి పాల్పడిన కానిస్టేబుల్‌ను మరో ప్రాంతానికి బదిలీ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

# వాయిదా వేద్దాం..



ప్రస్తుత డిజిటల్ యుగంలో.. చాలామంది స్మార్ట్‌ఫోనే ప్రపంచంగా బతికేస్తున్నారు. ఉదయం లేవగానే.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుంటున్నారు. మంచం మీదినుంచే.. సోషల్ మీడియా మెసేజ్‌లు, తాజా వార్తల ను తనిఖీ చేస్తున్నారు. అయితే, ఈ అలవాటు మెదడు పనితీరుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సైంటిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే ఫోన్‌లో తలదూర్చడం వల్ల.. ఆలోచనా విధానం, సృజనాత్మక సామర్థ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. ఉదయం మేల్కొన్న తర్వాతి మొదటి 15-20 నిమిషాలు మెదడుకు చాలా ముఖ్యమైన సమయం. అప్పుడే మెదడు 'పీక్ న్యూరోప్లాస్టిక్ మోడ్'లోకి ప్రవేశిస్తుంది. అంటే.. ఏదైనా నేర్చుకోవడానికి, మార్పులను స్వీకరించడానికి మెదడుకు ఉండే సామర్థ్యం. రాత్రంతా నిద్రలో ఉండి.. ఉదయాన్నే మేల్కొన్నప్పుడు ఈ సామర్థ్యం అత్యధిక స్థాయిలో ఉంటుందట. కాబట్టి, ఏదైనా ప్రేరణ కలగడానికి, దృష్టిని మెరుగుపరుచుకోవడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, సృజనాత్మకంగా ఉండటానికి.. మెదడుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ఆ సమయంలో ఫోన్‌తో గడపడం వల్ల.. మెదడు సృజనాత్మక ఆలోచనలపై ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా.. ఉదయాన్నే ఏదైనా ఇబ్బందికర సమాచారం, వార్తల గురించి విన్నప్పుడు మెదడు 'హై అలర్ట్' మోడ్‌లోకి వెళ్తుందట. మంచం మీదినుంచి లేవడానికి ముందే.. మెదడులో ఆందోళన, ఒత్తిడి పెరుగుతుందట. దీనిని నివారించడానికి '20 నిమిషాల ట్రిక్'ను అనుసరించాలని చెబుతున్నారు. నిద్ర లేచిన వెంటనే కాకుండా ఫోన్‌ను చూడటాన్ని 20 నిమిషాలు ఆలస్యం చేయాలని చెబుతున్నారు. మొదటి 20 నిమిషాలు ప్రశాంతంగా, సానుకూలంగా ఏదో ఒక పనిచేయాలని సూచిస్తున్నారు. చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌లు చేయడం, రోజువారీ చేయాల్సిన పనుల లిస్ట్‌ను తయారు చేసుకోవడం, ప్రధాన లక్ష్యాల గురించి ఆలోచించడం చేయాలని అంటున్నారు. ఈ చిన్న మార్పు.. మెదడుపై సానుకూల ప్రభావం చూపుతుందనీ, ఏకాగ్రత, సంతోషం పెరుగుతాయనీ చెబుతున్నారు.

# వేళ్ల మధ్య దురద, పగుళ్లు ఇలా పోగొట్టుకోండి..



వాతావరణంలో తేమ పెరిగి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వీటిలో సాధారణంగా కనిపించే ఒక సమస్య కాలి వేళ్ళ మధ్య ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా పాదం పగు ళ్లు. దీనివల్ల చాలాసార్లు కాలి వేళ్ళ మధ్య విపరీతమైన దురద వస్తుంది, చర్మం పగులుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే చాలు.

ఆవాల నూనె, వెల్లుల్లి : 2-3 వెల్లుల్లి రెబ్బలను ఆవాల నూనెలో వేసి వేడి చేయాలి. చల్లారిన తర్వాత ఈ నూనెను కాలి వేళ్ళ మధ్య రాయాలి. ఆవాలు, వెల్లుల్లిలో ఉండే యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు పగుళ్లను, ఇన్ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి. ఈ పద్ధతిని సాధారణంగా చాలా మంది ఉపయోగిస్తారు.

రావి చెట్టు బెరడు నీరు : రావిచెట్టు ఎండుబెరడునునీటిలో మరిగించాలి. ఆ గోరువెచ్చని నీటితో రోజుకు రెండుసార్లు 10-15 నిమిషాల పాటు పాదాలను కడగాలి. రావి బెరడులో యాంటీసెప్టిక్ గుణాలు ఉంటాయి, ఇవి గాయాలను, ఇన్ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి.

పసుపు, కొబ్బరి నూనె : 1 చెంచా పసుపులో కొద్దిగా కొబ్బరి నూనె కలిపి పేస్ట్‌గా చేసి, పగుళ్లు లేదా ఇన్ఫెక్షన్ ఉన్న చోట రోజుకు రెండుసార్లు రాయాలి. పసుపు ఇన్ఫెక్షన్లను తొలగిస్తుంది కొబ్బరి నూనె తేమను అందించి చర్మం పొడిగా మారకుండా చూస్తుంది.

వేప ఆకుల మరిగించిన నీరు : 10-15 వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటితో రోజుకు రెండుసార్లు పాదాలను కడగాలి. వేపకు శక్తివంతమైన యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ గుణాలు ఉన్నాయి, ఇవి చర్మ సమస్యలను దూరం చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి.

# లక్షణాలు గుర్తిస్తే.. ప్రమాదం దూరం

క్యాన్సర్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా క్యాన్సర్ మహమ్మారి అందర్నీ ప్రమాదంలోకి నెట్టేస్తున్నది. అయితే క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాన్ని తగ్గించొచ్చు. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడి, సాధారణ జీవితం గడపొచ్చు. చాలామంది క్యాన్సర్ లక్షణాలపై అవగాహన లేక సమస్యను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ పది లక్షణాలను గమనించి, వెంటనే వైద్యుణ్ని సంప్రదిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చు.


అకస్మాత్తుగా బరువు తగ్గడం: ఒకే నెలలో నాలుగైదు కిలోలు తగ్గుతున్నారంటే జాగ్రత్త పడాలి. కిలోల కొద్దీ బరువు ఒకేసారి తగ్గితే, అది కడుపు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ లక్షణం కావచ్చు.

ఎక్కువ అలసట: చిన్నచిన్న పనులకే ఎక్కువగా అలసిపోతున్నా, అది క్యాన్సర్ లక్షణం కావచ్చు. లుకేమియా లేదా లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్లలో కూడా ఈ లక్షణం ఉంటుంది.

కణితులు: మెడ, చంక మొదలైన చోట్ల కొత్తగా గడ్డలు కనిపించినా, లేదాచిన్న గడ్డలుగట్టిపడినా,పెద్దగాపెరిగినా వెంటనేడాక్టర్‌ను సంప్రదించాలి. అదిరొమ్ము,వృషణాలు,శోషరస సంబంధితక్యాన్సర్ కావచ్చు. చర్మం-పుట్టుమచ్చల్లో మార్పు: కొత్త పుట్టుమచ్చలు పుట్టుకురావడం, పాత మచ్చల రంగు, పరిమాణంలో మార్పులు, వాటిలోంచి రక్తం రావడం లాంటివి క్యాన్సర్ లక్షణాలుగా చెబుతారు. అందుకే చర్మ సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దు.

బ్లీడింగ్ ప్రమాదమే: మూత్రం, మలం, వాంతి, దగ్గులో రక్తం కనిపిస్తే, వెంటనే అప్రమత్తం అవ్వాలి. అవన్నీ మూత్రాశయ, పెద్దపేగు, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి.

ఆగని దగ్గు: వారాలు గడిచినా దగ్గు తగ్గకుండా, రక్తం పడుతున్నట్లయితే అది కేవలం ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. గొంతు, ఊపిరితిత్తులు, థైరాయిడ్ క్యాన్సర్‌కు సూచన అనుకొని జాగ్రత్తపడటం మంచిది.



అజీర్తి-మింగడంలోఇబ్బంది: ఆహారం మింగడంలో ఇబ్బందిగా ఉన్నా,ఛాతీలోమంట, అజీర్తి సమస్యలుదీర్ఘకాలంగా ఉంటే,వెంటనే అప్ర మత్తం అవ్వాలి. అది గొంతు,కడుపు,అన్నవాహికక్యాన్సర్‌కు దారితీయొచ్చు.

విసర్జన వేళల్లో మార్పులు: మల విసర్జన సమయాల్లో మార్పులు, అతిసారం, మలబద్ధకం, మలంలో రక్తం, మూత్రంలో మంట మొదలైనవి మూత్రాశయ, పెద్దపేగు, వీర్యగ్రంథి క్యాన్సర్ లక్షణాలు. వీటిలో ఏవి ఎక్కువ రోజులున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

విపరీతమైన నొప్పి: ఎముకలు, క్లోమం, అండాశయాల్లో క్యాన్సర్ ఉన్నప్పుడు.. కడుపు, వీపు లేదా కీళ్లలో నొప్పి విపరీతంగా ఉంటుంది. రోజులు గడిచినా ట్యాబ్లెట్లతో తగ్గకుంటే, వైద్యుణ్ని కలవడం అవసరం. రాత్రుళ్లు చెమటలు: తరచూ జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, వరుసగా ఇన్ఫెక్షన్లు లాంటివి కూడా క్యాన్సర్ లక్షణాలు అయ్యుండొచ్చు. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇవి దీర్ఘకాలం కొనసాగితే మాత్రం జాగ్రత్తపడటం తప్పనిసరి. కీడెంచి మేలెంచడం మంచిది కదా! ఈ తరహా లక్షణాలు వారాల తరబడి అలాగే కొనసాగుతూ ఉంటే.. వైద్యుణ్ని సంప్రదించడం తప్పనిసరి. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకోకుండా ఉంటుంది.

# యువతలో గుండెపోటులు ఎందుకు..



హైదరాబాద్, : ఇటీవల ఉప్పల్‌లో ఓ యువకుడు బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనికి కారణం అతడికి సడన్ కార్డియాక్ అరెస్ట్ కావడమే. సికింద్రాబాద్‌కు చెందిన 24ఏళ్ల యువకుడు జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. ఇక్కడా గుండెపోటే కారణం. ఇలా ఇటీవల చాలామంది యువకులు ముఖ్యంగా 30 ఏళ్లలోపే గుండెపోటుకు గురవుతున్నారు. వీటన్నిటికీ కారణాలేంటి? ఈ యువత గుండెకు ఏమైంది. అంత వీక్‌గా మనోళ్లు ఉన్నారా? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశం కానున్నాయి.తమ దగ్గరికి వచ్చే గుండె జబ్బు బాధితుల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హృద్రోగ నిపుణులు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు 50, 60 ఏళ్ల వయసు దాటిన వారిలోనే కనిపించే గుండె జబ్బులు.. ఇప్పుడు 20-30 ఏళ్ల వయసు వారిలోనూ చోటు చేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం, కండరాల వాపు వంటి వాటితో పాటు అంతకుముందు కుటుంబంలో ఎవరికో ఒకరికి ఈ జబ్బులు ఉంటేఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చిన్నప్పటి నుంచే జంక్ ఫుడ్‌ను అధిక మొత్తంలో తీసుకుంటుండటం వల్ల కొవ్వు శాతం పెరిగి గుండె స్పందనల్లో తేడాలొస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయంటున్నారు. ఇక మాదక ద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ గుండె సమస్యలొచ్చే ముప్పు అధికమని అంటున్నారు. అందుకే 25 ఏళ్లు దాటినప్పటి నుంచే గుండె ఆరోగ్యాన్ని తెలిపే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.చిన్న వయసులోనే క్రీడాకారులు ఇలాంటి ఆకస్మిక మరణానికి గురైతే హెచ్‌సీఎం- హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి కారణం అయి ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారిలో గుండె కండరాలు లావుగా ఉంటాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చి ఉంటుంది. వ్యాయామం చేసే సమయంలో గుండె నిమిషానికి 210 సార్లకంటే ఎక్కువగా కొట్టుకోవడం ద్వారా దాని చలనం ఆగిపోయి.. రక్తప్రసరణ జరగకుండా చనిపోతారు. యువకుల్లోనే ఇలాంటివి కనిపిస్తాయి. అథ్లెట్లు, క్రీడాకారులు కొన్ని రకాల స్టెరాయిడ్లు వినియోగించినా కండరాలు అధికంగా సంకోచ వ్యాకోచాలకు గురై ఒక దశలో ఆగిపోయి చనిపోతారు. వ్యాయామానికి ముందు యువకులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. తల్లిదండ్రులకు ఇతర రక్తసంబంధీకులకు గుండెజబ్బులు ఉంటే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.అలాగే మధుమేహం, అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి, కొవ్వు పేరుకుపోయి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. షుగర్ ఉంటే 2 నుంచి 3 రెట్లు ఎక్కువ ముప్పు ఉంటుంది. కొవిడ్ వైరస్ గుండె కండరాలకు వాపు కలిగించవచ్చు. ఇది కూడా గుండె పోటు ప్రమాదాన్ని పెంచవచ్చు. యువతలో గుండెపోటు నివారించడా నికి పండ్లు, కూరగాయలు, చేపలు, చికెన్, తృణధాన్యాల వంటి ఆహారాన్ని తీసుకోవాలంటున్నారు డాక్టర్లు. రోజూ ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తున్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు నడుస్తూనో.. వ్యాయామం చేస్తూనో.. గుండెనొప్పితో కుప్పకూలిపోతు న్నారు. కార్డియాక్ అరెస్టు కావడమే ఇలాంటి ఘటనలకు కారణం.రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉన్నా.. ముందే గుర్తించకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఆహారం ఊపిరితిత్తులకు చేరడం వల్ల రక్తనాళాల్లో అడ్డుపడి మృత్యువాత పడతారు. స్టెరాయిడ్లు వాడకూడదు. చిన్న వ్యాయామాలకైనా.. పరిగెత్తినా అలసటగా ఉంటే వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. సడన్ స్ట్రోక్ వచ్చే వారిలో సగం మంది ఆస్పత్రికి చేరకుండానే మరణిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారు.. అప్పుడు తక్షణ చికిత్స అందిస్తే బాధితుడి కాపాడుకోవచ్చు. సీపీఆర్ చేయడం ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలంటున్నారు వైద్యులు.

# రాత్రి పూట యాలకుల పాలను తాగితే ఎన్నో లాభాలు..



## కచ్చితంగా రోజూ తాగండి..!

యాలకులు మన వంట ఇంట్లో సుగంధ ద్రవ్యాలుగా ఎప్పటి నుంచో ఉన్నాయి. మసాలా వంటకాల్లో యాలకులను ఎక్కువగా వేస్తుంటారు. చికెన్, మటన్ తోపాటు శాకాహార మసాలా వంటకాలు, స్వీట్లలో యాలకులను ఉపయోగిస్తారు. దీంతో వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే యాలకులను రాత్రి పూట పాలలో మరిగించి ఆ పాలను తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యాలకుల పాలను రోజూ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అంటున్నారు. యాలకుల పాలను తాగడం వల్ల ట్రిప్టోఫాన్ లభిస్తుంది. ఇది ఒక అమైనో యాసిడ్. నిద్రను ప్రేరేపిస్తుంది. శరీరంలో సెరొటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి ఉన్నవారు రాత్రి పూట యాలకుల పాలను తాగితే ప్రయోజనం ఉంటుంది.

మానసిక ఆరోగ్యానికి..: యాలకుల పాలను తాగడం వల్ల నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి డిప్రెషన్ నుంచి బయట పడతారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా మారి యాక్టివ్ గా ఉంటుంది. మరుసటి రోజు ఉత్తేజంగా పనిచేస్తారు. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. అసిడిటీ, కడుపు నొప్పి ఉన్నవారు ఈ పాలను తాగితే ఎంతగానో ప్రయోజనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. యాలకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

బీపీ తగ్గేందుకు..: యాలకుల్లో పొటాషియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తాయి. యాలకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. యాలకుల పాలను తాగడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షించుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా గుండె పోటు రాకుండా ఉంటుంది. యాలకుల్లో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకుల పాలను సేవిస్తే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

వాపులు, నొప్పులకు..: యాలకుల పాలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ సమస్య తగ్గుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలకుల పాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి, అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మెటబాలిజం పెరిగేలా చేస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఒక కప్పు పాలలో 2 లేదా 3 యాలకులను వేసి బాగా మరిగిస్తే యాలకుల పాలు రెడీ అవుతాయి. కాస్త తేనె కలిపి తాగితే రుచిగా ఉండడమే కాదు, అనేక ప్రయోజనాలను అందిస్తాయి.

# పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలం



ఈ సీజన్‌లో సహజసిద్ధంగా లభించే పుట్టగొడుగుల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగుల్లో సెలీనియం, విటమిన్ సి, కోలిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు, పుట్టగొడుగుల్లో ప్రోటీన్, బి-కాంప్లెక్స్ విటమిన్లు, ఫైబర్ కూడా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిసి కణం, కణజాల నష్టాన్ని నిరోధించడంలో సహాయపడతాయి. రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి. ఇందులో ఉండే విటమిన్ డి ఎముకలు, కీళ్ల సమస్యల పరిష్కారానికి దోహదపడుతుంది. పుట్టగొడుగుల్లో ఎర్గోస్టెరాల్ అనే 'ప్రోవిటమిన్' ఉంటుంది. ఇవి సూర్యరశ్మికి గురైన తర్వాత విటమిన్ డిగా మారుతుంది. విటమిన్ డి సాంద్రతను పెంచడంలో ఇది సహాయపడుతుంది. పుట్టగొడుగుల్లో యాంటీ ఆక్సిడెంట్లు, బి-కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి. బీటా-గ్లూకాన్ అనేది పుట్టగొడుగుల్లో సాధారణంగా కనిపించే ఒక కరిగే ఫైబర్. ఈ కరిగే ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పుట్టగొడుగుల్లో గ్లూటాతియోన్, విటమిన్ సి, సెలీనియం వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మంపై ముడతలు రాకుండా సహాయపడతాయి.

# సిటీ చుట్టూ రేడియల్ రింగ్



హైదరాబాద్, : హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్' పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్‌తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరో మార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో ఒక ప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్‌వర్క్‌ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. సాధారణంగా నగరానికి ఒక్కో వైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్‌ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోని వివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్త ప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్‌కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికి మళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్‌కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనే మాట వినిపించదు. పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్ల నిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో 'ట్రౌట్' చేపల సాగు కేంద్రం

రంగారెడ్డి,: హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకా శాలు మెరుగుపడతాయి. మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన 'రెయిన్‌బో ట్రౌట్' చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది.

అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే

అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభు త్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరా బాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

# బస్సు డ్రైవర్... దేశాధ్యక్షుడు ఎలా అయ్యారు..

న్యూఢిల్లీ: వెనిజుల అధ్యక్షుడిని అమెరికా అరెస్ట్ చేసింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అదే కాదు, మదురో ను అరెస్ట్ చేసిన ఫోటోలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అమెరికా సైన్యం విజయవంతమైన పని చేస్తుందని అందులో రాసుకొచ్చారు. మదురో ను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తున్న ఫోటోలు ట్రంప్ పోస్ట్ చేయడంతో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది. మదురో అరెస్ట్ తర్వాత వెనిజులా ప్రాంతంలో ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో అమెరికా ఏం చేస్తుంది? తనకు నచ్చిన వ్యక్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయిస్తుందా? ఉన్న ప్రభుత్వాన్ని తన చెప్పు చేతల్లో పెట్టుకొని.. తోలుబొమ్మ లాగా ఆడిస్తుందా.. ఈ ప్రశ్నలకు మరి కొద్ది రోజుల్లోనే సమాధానాలు లభిస్తాయి. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత అమెరికా సంబరాలు చేసుకుంటున్నది. వాస్తవానికి మదురో ఓవర్ నైట్ లో వెనిజులా దేశానికి అధ్యక్షుడు కాలేదు. అతడు చిన్న స్థాయి నుంచి తన జీవితాన్ని మొదలుపెట్టాడు. ఒక బస్సు డ్రైవర్ గా జీవితాన్ని ప్రారంభించాడు. ఆ తర్వాత రాజకీయాలలోకి వచ్చాడు. క్రమ క్రమంగా ఎదిగాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన.. వెనిజులా అధిపతి హ్యూగో చావేజ్ కు ప్రధాన అనుచరుడిగా మారిపోయారు. ఆ తర్వాత రాజకీయాలలో ఎదిగారు. చావెజ్ కన్ను మూసిన తర్వాత 2013లో వెనిజులా దేశానికి అధ్యక్షుడయ్యారు. అయితే ఆ దేశాన్ని ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టింది. ఇదే క్రమంలో మదురో మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. అమెరికాకు అక్రమంగా మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని విమర్శలు వినిపించాయి. చివరికి అమెరికా మాదక ద్రవ్యాలను సాకుగా చూపించి.. వెనిజులా మీద దాడి చేసింది. మదురో ను అరెస్ట్ చేసింది. మదురో మొదటి నుంచి కూడా స్వయం ప్రతిపత్తి కల నాయకుడు. అనేక సందర్భాలలో అమెరికా ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు. ఇది సహజంగానే అమెరికాకు కడుపు మంటగా మారిపోయింది. దీంతో సమయం కోసం ఎదురుచూసిన ఆ దేశం. మదురో కు చెక్ పెట్టింది. అనేక విషయాలలో ఆయనకు అడ్డు తగిలింది. చివరికి దేశం మీద దాడి చేసి.. సైన్యాన్ని మోహరించి.. అరెస్టు చేయించింది. మదురో ను అరెస్ట్ చేసిన తర్వాత.. అతడిని అమెరికా తన అదుపులో ఉంచుకుంటుంది. ఎన్నో రకాలుగా ఇబ్బంది పెట్టిన తర్వాతనే బయటికి విడుదల చేస్తుందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఒకవేళ విడుదల చేసినా.. సొంత దేశంలో అతడిని అనేక రకాలుగా ఇబ్బంది పెట్టి.. కాలగర్భంలో కలిపేలా చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# మళ్లీ రేసులోకి ధర్మాన



శ్రీకాకుళం, : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్‌గా మారారు. ఈ మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి. ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుంబాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం. ఇప్పుడు అదే సమయంలో ధర్మాన ప్రసాదరావుకు మరింత ప్రాధాన్యం పెరగడం రాజకీయం గా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం.

# ప్రజాసేవే పరమార్థమైన మహా దాత..!



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపాధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్తవానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు.


అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.

కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొతాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు,

స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు.

తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగిపోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100ఎకరాల భూమిని దానం చేశారు. .1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర

# అక్రమార్జనపై ఉద్యోగుల మక్కువ



హైదరాబాద్, : ప్రభుత్వ శాఖల్లో అవినీతి వేళ్లానుకుంది. రెవెన్యూశాఖలో పాసుపుస్తకాలు మొదలుకొని ఇతర అన్ని సేవలకు ఉద్యోగులు, అధికారులు లంచం తీసుకుంటున్నారని ఎంతోమంది బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి కాలంలో తెలంగాణ లో దాడులు పెరిగాయి. ఫిర్యాదు రావడమే ఆలస్యం ..ఎసిబి స్పందించి వలపన్నుతోంది. ఎందరో చిక్కుతున్నారు. మరెందరో తప్పించుకుంటు న్నారు. ప్రజల పన్నులతో జీతాలు పొందుతున్న ఉద్యోగులు ప్రజలకు పనులు చేసి పెట్టకుండా లంచాలు మేస్తున్నారు. రెరా అధికారి బాలకృష్ణ మొదలు అనేకమంది పట్టుబడ్డారు. నీటిపారుదల శాఖలో తిమింగలాలు పట్టుబడ్డాయి. వందలకోట్లు అప్పనంగా సంపాదించినా నాయకులు, ఉద్యోగులు అక్రమాస్తులపై మక్కువ వదలడంలేదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలో ఎక్కడ చూసినా ఎసిబి కేసులు నిత్యం నమోదవుతూనే ఉన్నాయి. రాజకీయ నాయ కులు, అధికారులు బినామీల పేరుతో ఆస్తులు కూడగడుతున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు ఈ విషయాలను పెద్దగా పట్టించుకోక పోవడం గమనార్హం. రాజకీయ నాయకులు కూడా ఆస్తుల వివరాలు ప్రకటించాల్సి ఉన్నా కొందరు మాత్రమే వెల్లడిస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు వారితోపాటు వారి కుటుంబసభ్యుల ఆస్తుల వివరాలు నామినేషన్ సమయంలో అఫిడవిట్‌లో వివరించాల్సి ఉంటుంది. పలు పార్టీల్లో ఉన్న కొందరు రాజకీయ నేతలు ప్రజాప్ర తినిధులు ఎన్నికైన తర్వాత అక్రమార్జనతో కోట్లకు పడుగలెత్తారు. గుత్తేదారుల నుంచి పర్సెంటేజీలు మొదలుకొని ప్రభుత్వ, ఆస్తులను ఆక్రమించుకొనే వరకు మరీ అక్రమ సంపాదనకు తెగబడుతున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు మామూళ్లు వసూలు చేస్తున్నారని విమర్శలు లేకపోలేదు. ఇది నిజమని తెలిసినా వారిని ఎవరూ అడ్డుకోవడం లేదు.

నిషేధిత ఆస్తులు సైతం అక్రమంగా రిజిస్ట్రేట్రషన్ చేసి కొందరు కోట్లు సంపాదించిన ఉదంతాలు ఉన్నాయి. ఈ శాఖలో ఉద్యోగుల బదిలీల్లోనూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం మనకు తెలిసిందే. నీటిపారుదలశాఖ, రోడ్లు భవనాలశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, నగరపాలకసంస్థ, పురపాలకలు, విద్యుత్‌శాఖ పరిధిలో జరిగే ప్రతి పనుల్లో అధికారులు, ఉన్నతాధికారులు, నేతలకు పర్సెంటీజీలు అందుతాయనేది బహిరంగ రహస్యమే. పోలీసుశాఖలో నెలసరి మద్యం మామూళ్లు, కేసుల వ్యవహారాల్లో వసూళ్ల దందా మామూలై పోయిందని బాధితులు వాపోతున్నారు. ఇలా ప్రతిశాఖలోనూ అవినీతి, అక్రమాల పలు పంథాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు, ఉన్నతాధికారులు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. అక్రమాస్తులు కూడగడితే శిక్ష తప్పదని కోర్టు మరోమారు రుజువు చేసినా అక్రమార్కులు తమ చేతులు తడపనిదే పనులు చేయడం లేదు. మద్య నిషేధ, అబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు మొదలు కొని ఉన్నతాధికారుల వరకు నెలసరి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని రుజువు చేస్తున్నా ఉద్యోగుల తీరు మారడం లేదు. ఇకపోతే నాయకులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడు తున్నారు.

# అజరామరం.. ఆ గానం!

భారతావనిలో ఎందరో గాయకులు ఉద్భవించారు. ఎందరో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. కాని సంగీత ప్రియుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని పొందిన ఘనత ఘంటసాల మాస్టారుకే దక్కుతుంది. ప్రముఖ గాయకులుగా, తెలుగు సినీ సంగీత దర్శకులుగా, జైలు కెళ్ళిన స్వాతంత్ర్య సమర యోధులుగా ఎనలేని కీర్తినార్జించిన గాన గంధర్వుడు తెలుగువాడు కావడం గర్వకారణం. 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీప చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మలకు జన్మించిన వేంకటేశ్వరరావు నామాంకితుడైన ఘంటసాల,

బాల్యం నుండే సంగీతం పట్ల మక్కువ కలిగి ఉన్నారు. కచేరీలలో తండ్రి మృదంగం సహకారం అందించడానికి వెళుతూ, కుమారుడిని భుజంపై ఎత్తుకుని పాటలు పాడుకుంటూ తీసుకెళ్ళేవారు. కచేరీలలో నాట్యం చేస్తూ, బాల భరతుడు అనిపించు కున్నారు, తాము గొప్ప సంగీత విద్వాంసుడు కావాలనే తమ 11వ ఏట మరణించిన తండ్రి ఆకాంక్షను సాకారం చేయ దృఢ సంకల్పులై, ఒకసారి ఒక సంగీత కచేరీలో పోటీపడి ఓటమి చెందగా, పట్టుదల మరింత పెరిగి, గురుకులాలలో చేరి, కట్టుబాట్లకు తట్టుకోలేక తిరిగి వచ్చేసారు. కొందరు విద్వాంసుల ఇళ్ళల్లో బట్టలుతికి, వంటచేసి, సంగీతా భ్యాసం చేసి, తర్వాత తమ దగ్గరున్న నలభై రూపాయల విలువైన బంగారు ఉంగరాన్ని కేవలం ఎనిమిది రూపాయలకే విక్ర యించి, ఆంధ్రరాష్ట్రంలోని ఏకైక సంగీత కళాశాల ఉన్న విజయ నగరానికి చేరుకున్నారు.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.